


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025 11 పేజీలు


### గ్రామంలోని పిల్లలు

# ప్రభుత్వ బడిలోనే చదవాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**సూర్య తంగళ్లపల్లి**

గ్రామంలోని పిల్లలు ప్రభుత్వ బడిలోనే చదివేలా చూడాలని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచ పరిధి తెనుగు వారిపల్లెలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, గ్రామంలోని రోడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం తరగతి గదులు, మధ్యాహ్నం భోజనం సిద్ధం చేస్తుండగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఏమైనా



ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరా తీశారు. వాటర్ ప్యూరిఫైర్, ఫ్యాన్లు మరమ్మతులు చేయించి, అందుబాటులోకి తీసుకురావాలని, కిచెన్ షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు మంచి భవనం ఉందని, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని పేర్కొన్నారు. గ్రామంలోని పిల్లలందరూ ఇదే పాఠశాలలో చదివేలా చూడాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన, సాంకేతికతతో కూడిన బోధనపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులు చదువులో రాణించేలా క్రమశిక్షణతో కూడిన భోధనను అందిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కార్తిలాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తంగళ్ళపల్లి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లోనే 75 శాతం ప్రసవాలయ్యేలా చూడాలని వైద్యులకు, సిబ్బందికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా (మిగతా 2లో)

### కురిక్యాల శివారులో మహిళ మృతదేహం

# కేసు ఛేధించిన పోలీసులు

- మృతురాలు మేడ మమతగా గుర్తింపు
- అక్రమ సంబంధం నేపథ్యంలో సుపారీ హత్య
- వివరాలు వెల్లడించిన చొప్పదండి సీఐ ప్రకాష్ గౌడ్



**సూర్య, చొప్పదండి**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల శివారులో జనవరి 26న గుర్తు తెలియని మహిళ మృత దేహం స్థానికుల ద్వారా గుర్తించిన సంగతి తెలిసిందే. చొప్పదండి సీఐ ఆర్. ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో గంగాధర ఎస్ ఐ జి. నరేందర్ రెడ్డి బృందం ఈ కేసును ఛేదించారు. మృతురాలు మంచిర్యాల జిల్లా కాసిపేట్‌కు చెందిన మేడ మమత (25)గా గుర్తించారు. అక్రమ సంబంధం నేపథ్యంలో సుపారీ హత్యగా పోలీస్ లు తేల్చారు. చొప్పదండి సీఐ ప్రకాష్ గౌడ్ గురువారం చొప్పదండి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సి.ఐ ప్రకాష్, గంగాధర ఎస్ఐ ఈ నెల 5న తమ సిబ్బందితో గంగాధర ముండలము వెంకటాయపల్లి స్టేజీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తూ ఈ మర్డర్ కేసు నిందితుడు లక్షెటిపేట కు చెందిన వేల్పుల కళ్యాణ్ ( 20) ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మ్రుతురాలు మేడ మనుత మంచిర్యాల జిల్లా కాసిపేట స్వగ్రామం కాగా ఆమె తన భర్తతో మనస్పర్ధలు వచ్చి కొంత కాలంగా తనకు తెలిసిన వారి ఇంట్లో తిలక్నగర్, నుంచిర్యాలలో ఉంటు క్యాటరింగ్ పని (మిగతా 2లో)

### డి ఫోర్ కెనాల్‌లో మట్టి చెత్త..

# చెరువులు నిండేదేలా..??

**- ఆందోళన చెందుతున్న రైతులు..**



**.సూర్య బోయినపల్లి..**

డి ఫోర్ కెనాల్ లో మట్టి, చెత్తా చెదారం నిండిపో వడంతో మల్కాపూర్, తడగొండ చెరువులకు కెనాల్ ద్వారా నిరు రావడం కష్టంగా మారగా రైతులు ఆందోళన (మిగతా 2లో)



### ఉద్యోగ , ఉపాధ్యాయుల వ్యతిరేక ప్రభుత్వాలుగా

# బిఆర్ఎస్, కాంగ్రెస్‌లు

**- నామినేషన్ వేసిన బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొంరయ్య**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్, ఆదిలాబాద్ , నిజామాబాద్, మెదక్ టీచర్స్ ఎమ్మెల్సీ బిజెపి అభ్యర్థి (మిగతా 2లో)




### బాధితులకు అండగా

# భరోసా సెంటర్

**- రామగుండం సిపి ఎం.శ్రీనివాస్**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

బాధితులకు అండగా భరోసా సెంటర్‌లు నిలుస్తాయని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్ సంవత్సర కాలం పూర్తవుతున్న సందర్భంగా ఏర్పాటు చేసన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటూ వారి సమస్యల పట్ల స్పందించి వారికి భరోసాగా ఉండడమే భరోసా సెంటర్ లక్ష్యమని అన్నారు. వేధింపులకు గురి అవుతున్న మహిళలు ఆపదలో ఉన్న చిన్నారులకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భరోసా కేంద్రాలలో దేశంలోనే తెలంగాణ ముందంజలో ఉందని తెలిపారు. అనంతరం బాధితులతో మాట్లాడి వారికి ఆర్థిక సహాయం అందజేశారు. లైంగిక వేధింపులకు గురైన (మిగతా 2లో)



# కురిక్యాల శివారులో మహిళ మృత దేహం కేసు చేదించిన పోలీస్‌లు

**(మొదటి పేజీ తరువాయి)**

చేసుకుంటు జీవిస్తున్నది.ఈ నేపథ్యంలో మంచిర్యాల జిల్లా రామకృష్ణపూర్ కు చెందిన సిగరేణి ఉద్యోగస్తుడు కులుమల్ల భాస్కర్ మేడ మనుతతో సన్నిహితంగా ఉంటూ, ఆమెతో శరీరక సంబంధం పెట్టుకున్నాడు. నెల నెల వచ్చిన జీతం ఆమెకు ఇస్తూ భాస్కర్ వాళ్ళ ఇంట్లో వాళ్ళను సరిగా చూసుకోవడం లేదు. ఇంట్లో వారు అతనికి ఎంత చెప్పిన మాట వినకపోవడముతో భాస్కర్లో మార్పు రావలంటే మమతను దూరం చేయాలనే ఆలోచనకు వచ్చారు. ఇదే ఉద్దేశ్యముతో భాస్కర్ అక్క నర్మద, రఘు కలిసి పథకం రచించి నర్మద తండ్రి రాయలింగు,బావ వెంకటేష్ తో కలిసి మమతను హత్య చేయదానికి నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా లక్సెట్టిపేట కు చెందిన నిందితుడు వేల్పుల కళ్యాణ్ తో 5 లక్షలకు డీల్ మాట్లాడుకున్నారు. మొదట సుమారు 60 వెల రూపాయలు కళ్యాణ్ కు ముట్ట చెప్పారు.కళ్యాణ్ పథకం ప్రకారం మమత ఫోన్ నెంబరు తీసుకొని ఒక వారం రోజులు ఆమెను అనుసరించి ఆమెతో పరిచయం పెంచుకున్నాడు.ఆమె అవసరాలకు డబ్బులు ఇచ్చి మచ్చిక చేసుకున్నాడు.అదే క్రమములో సెల్ఫు డ్రైవింగ్ కారు కిరాయికి తీసుకొని జనవరి 25,2025 న ఆమెను నమ్మించి బయటకు తీసుకువెళ్లదానికి సాయంత్రము 4.30 గంటల ప్రాంతములో మమత, ఆమె 4 సం:ల కొడుకును కారులో ఎక్కించుకొని రాత్రి పదేవరకు మంచిర్యాలలోనే తిప్పాడు.సాయంత్రం 6.00 గంటల ప్రాంతములో కారులోనే కత్తితో మెడపై పొడిచి, నైలాన్ తాడుతో గొంతు బిగించి హత్య చేసాడు. అనంతరం నర్మద వాళ్లను పిలిపించి శవాను చూపించి రూ: 4,00,000లు తీసుకొని అదేరోజు రాత్రి కారులో బయలుదేరి మంచిర్యాల నుండి లక్సెట్టిపేట, ధర్మపురి, జగిత్యాల మీదుగా వచ్చి రాత్రి సుమారు 11.30 గంటల ప్రాంతంలో మనుత శవాన్ని కురిక్యాల శివారులో రోడ్డు ప్రక్కన పడేసి బాబును తీసుకొని హైదరాబాద్ పారిపోయాడు.ఈ నేపథ్యంలో గత నెలలో గుర్తు తెలియని మృత దేహం గుర్తించిన అనంతరం చొప్పదండి సీఐ, గంగాధర ఎస్ ఐ తమ బృందం తో మృతురాలు ఉంటున్న మంచిర్యాలలో సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి షిఫ్ట్ కారులో మమత, కొడుకుతో వెళ్లినట్టు గుర్తించారు. ఆధునిక టెక్నాలజీతో కారు నంబర్ గుర్తించి నిందితుడు చెన్నైలోని ఒక హోటల్లో ఉన్నట్లు నిర్ధారణ చేసుకొని సీఐ, ఎస్ ఐ బృందం చెన్నై వెల్లగా బాబును విడిచి పెట్టి పరారు అయినట్టు తెలిపారు. బాబును తీసుకొని వచ్చి మృతురాలి అత్త, మామ లకు అప్పగించినట్లు సీఐ వివరించారు. కాగా ఈ కేసులో సీఐ ఆధ్వర్యంలో అసమాన ప్రతిభ కనబరిచిన గంగాధర ఎస్ ఐ నరేందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ జంపయ్య, రామడుగు కానిస్టేబుల్ శ్రీధర్, ఐటీ కానిస్టేబుల్స్ ప్రదీప్, మహేందర్ లను సీఐ ప్రకాష్ గౌడ్ అభినందించారు.

# ఉద్యోగ , ఉపాధ్యాయుల వ్యతిరేక ప్రభుత్వాలుగా బిఆర్ ఎస్, కాంగ్రెస్‌లు

**(మొదటి పేజీ తరువాయి)**

మల్క కొంరయ్య గురువారం రోజున కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి , జిల్లా కలెక్టర్ పమేల సత్పతి కి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొంరయ్య మాట్లాడుతూ గత బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక ప్రభుత్వాలుగా మారా యన్నారు . ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రెండు ఎకరాల ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు కేవలం జీతాలు పొందుతున్నారే తప్ప ఏ సౌకర్యాలు పొందడం లేదన్నారు. ముఖ్యంగా ఉద్యోగ విరమణ చెందుతున్న ఉపాధ్యాయులకు పెన్షన్, గ్రాట్యూటీ, జీపిఎఫ్, సరెండర్ లీవ్ డబ్బులు, పిఆర్ సి ఇచ్చే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదన్నారు. బి ఆర్ఎస్ , కాంగ్రెస్ ఎమ్మెల్సీలు ఏనాడు కూడా ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల కోసం కొట్లాడింది లేదు, శాసనమండలిలో మాట్లాడింది లేదన్నారు. ఆ రెండు పార్టీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం ఇచ్చినందున జరగబోయే ఎన్నికల్లోబిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించా లని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుక నవుతాన న్నారు. అనంతరం కరీంనగర్లోని ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయంలో బిజెపి ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కరీంనగర్ బిజెపి టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, శాంతి కుమార్ , జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి లు మాట్లాడారు. జరగబోయే ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యక్రమాల పై తగిన సూచనలు చేస్తూ, దిశానిర్దేశం చేశారు. నామినేషన్ కార్యక్రమంలో మాజీ టీచర్స్ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, తపస్ రాష్ట్ర అధ్యక్షులు హనుమంత రావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, నిజామా బాద్ జిల్లా మాజీ అధ్యక్షులు బసవ లక్ష్మీ నరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శితాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, నాంపల్లి శ్రీనివాస్, నరహరి లక్ష్మారెడ్డి , దండు కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నపై రెడ్డి కులస్తులు

**- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**

**సూర్య తిమ్మాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**



ఎమ్మెల్సీగా ప్రజల ఓట్లతో ఎన్నికై కౌన్సిల్ లో ప్రమాణం చేసిన నవీన్ (తీన్మార్ మల్లన్న) రాజ్యాంగ విరుద్ధంగా రెడ్డి కులస్తులను చులకనగా మాట్లాడి, కులాల పేరుతో దూషణ చేయడం, కులాల మధ్యన చిచ్చు పెట్టడం, ప్రజలను రెచ్చగొట్టడం పై ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ లో తిమ్మాపూర్ మండల రెడ్డి సంఘం ఫిర్యాదు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కెతిరెడ్డి అంజిరెడ్డి, కనుగంటి మధుకర్ రెడ్డి,ఎల్ల అంజిరెడ్డి, పాశం అశోక్ రెడ్డి, సింగిరెడ్డి భాస్కర్ రెడ్డి,రామిడి మల్లారెడ్డి, ల్యాగల బాపురెడ్డి, ఎల్ల బూమ్ రెడ్డి,లక్ష్మారెడ్డి ,తిమ్మాపూర్ మండల రెడ్డి సభ్యులు పాల్గొన్నారు

# హమ్ ఆధ్వర్యంలో పుస్తకాల వితరణ

**సూర్య కరీంనగర్ టౌన్**



హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గుంజ హై స్కూల్ గ్రంథాలయానికి స్కూల్ పిల్లల కు ఇంగ్లీషులో రచించిన టువంటి చిన్న చిన్న కథల పుస్తకా లను స్కూల్ హెడ్ మాస్టర్ కు అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతు ఇంగ్లీషులో మాట్లాడే ప్రావీణ్యతను పెంపొందించడానికి ఈ పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయని, నేటి పిల్లలలో పుస్తకాలు చదవడం చాలా తగ్గిపోయి ఒదని అలా కాకుండా విద్యార్థులకు చిన్నప్పటినుండే మంచి కథల పుస్తకాలను చదవడం అలవర్చాలని ఉద్దేశంతోనే ఈ పుస్తకాలను మా పెళ్లిరోజు సందర్భంగా అందజేయడం జరిగింది అని తెలిపారు . ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ స్వరూప రాణి, సంస్థ సభ్యులు స్వర్ణలత, శ్రీధర్ రెడ్డి,హిమసాయి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పారమిత పాఠశాలను సందర్శించిన ఎన్ సి సి కమాండింగ్ అధికారి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

పారమిత పాఠశాలలోని ఎన్.సి.సి విభాగాన్ని 9 తెలంగాణ బెటాలియన్ ఎన్ సి సి కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రాకేశ్వర్ జస్వాల్, సుబేదార్ మేజర్ సాగర్ సింగ్ సందర్శించారని పారమిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు.పారమిత పాఠశాలలో 3 సంవ త్సరాల పాటు వివిధ దశలుగా అభివృద్ధి చెందిన క్రమాన్ని, ఎన్.సి.సి కార్యక్రమాలను నిర్వహించే విధానాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో కమ్యూనిటీ ఔట్రీచ్ కార్యక్రమాలను చేపట్టే విధానాన్ని ఆయన ప్రశంసించా రు .ఈ సందర్భంగా పారమిత పాఠశాలను సందర్శించి, సలహాలు సూచనలు ఇచ్చిన లెఫ్టినెంట్ కల్నల్ రాకేష్ జస్వాల్‌ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ నేపథ్యంలో పారమిత పాఠశాల ఎన్. సి. సి విభాగ అభివృద్ధికి సలహాలు సూచనలు ఇచ్చిన లెఫ్టినెంట్ కల్నల్ రాకేష్ జస్వాల్ మరియు సుబేదార్ మేజర్ సాగర్ సింగ్ లను పారమిత పాఠశాలల అధినేత డా: ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ ప్రశాంత్, సమన్వయ కర్తలు, ఎన్.సి.సి. కేర్ టేకర్ బి. ప్రశాంత్, ఎక్స్ సర్వీస్ మెన్ రమేశ్ లు పాల్గొన్నారు.



# సీఎల్పీ సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**సూర్య వేములవాడ**



హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ లో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సీఎల్పీ సమావేశానికి ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి దీప దాస్‌మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**సూర్య సిరిసిల్ల టౌన్**

ఆర్థిక ఇబ్బందులు,కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిరిసిల్లలో చోటుచేసుకుంది.సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విద్యానగర్ చెందిన మడుపు జయ కీర్తి రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరిపో సుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు దినసరి కూలిగా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొ స్తున్నాడు గత కొంతకాలంగా సరైన పని దొరకకపోవడంతో ఇంటి వద్ద ఉంటున్నాడు.పని లేక ఇంట్లో ఉండడంతో భార్యతో తరచూ గొడవలు జరిగేవనీ వారం రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన జయ కీర్తి రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.మృతుడికి భార్య శ్రావణి,కొడుకు మంజునాథ్ లు ఉన్నారు. సిరిసిల్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# డి ఫోర్ కెనాల్‌లో మట్టి చెత్త.. చెరువులు నిండేనా..

**(మొదటి పేజీ తరువాయి)**

చెందు తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి చివరి మడి వరకు నీరు అందిస్తామని రైతులకు మాట ఇచ్చిన విధంగా పంపులు ఎమ్మెల్యే ప్రారంభించగా ఏట్లకేలకు నిరు వస్తుండగా తిప్పాయపల్లె నుండి మల్యాపూర్ ,తడగొండ వచ్చే కెనాల్ లో చెత్త,చెదారంతో పాటు పూడిక ఉండడంతో నిరు రాకపోవడంతో చెరువులు నిండు తాయ లేదా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే ఉంటే పంటలకు సమయానికి నీరు అందకపోవడంతో ఎండిపోతాయని వెంటనే అధికారులు మరమ్మ త్తులు చేపట్టాలని , ఎమ్మెల్యే చొరవ తీసుకొని పూడిక పనులు చేపట్టాలని రైతు చెపురి కనకయ్య తో పాటు రైతులు, గ్రామాల ప్రజలు కోరారు.

# గ్రామంలోని పిల్లలు ప్రభుత్వ బడిలోనే చదవాలి

**(మొదటి పేజీ తరువాయి)**

ఆదేశించారు. పీ.హెచ్.సీ ఆవరణలో గడ్డి, నిరుపయోగ మొక్కలు పెరగడం తో వాటిని తొలగించాలని ఎం.పీ.ఓ.ను ఆదేశించారు. పరిసరాలను పరిశు భ్రంగా ఉండేలా చూడాలని,సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు.పీ.హెచ్.సీ లోని ఓ.పి,రిజిస్టర్ లను తనిఖీ చేశారు. ల్యాబ్,ఫార్మసీ ఆయా గదులను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు.ఏ.ఎన్.ఎం,ఆశా కార్యకర్తలతో నిత్యం సమావేశం ఏర్పాటు చేయా లని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అఫిజా బేగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా భరోసా సెంటర్

**(మొదటి పేజీ తరువాయి)**

బాధితులకు అండగా ఉంటూ టూ వారికి భరోసా కనిపిస్తూ, భరోసా సెంటర్ అందించే సేవల గురించి అవగాహన కల్పిస్తున్న సెంటర్ సిబ్బందిని ఈ సందర్భంగా సిపి ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమం లో పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీ జి. కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, పెద్దపల్లి ఎస్ఐ లు లక్ష్మణ్ రావు, మల్లేష్ లు, భరోసా సెంటర్ సిబ్బంది, పాల్గొన్నారు.

# రక్త దానం చేసి మానవత్వం చాటుకున్న శ్రవణ్ కుమార్

**సూర్య కరీంనగర్ టౌన్**



కరీంనగర్ లోని లైఫ్ లైన్ ప్రవేట్ హాస్పిటల్ లో కరీంనగర్ కి చెందిన సాక్షి రిపోర్టర్ భాస్కర్ అన్న కు బ్లడ్ చాలా తక్కువ ఉండి ఏబి పాజిటివ్ బ్లడ్ అవసరం కాగా గాలిపల్లి కుమార్ ద్వారా విషయం తెలుసుకున్న యాటెల్లి శ్రవణ్ కుమార్ వెంటనే స్పందించి బ్లడ్ బ్యాంక్ కి వచ్చి తన 30వ సారి రక్త దానం చేసి తన మానవత్వం చాటుకున్నారు. రక్త దానం చేసిన శ్రవణ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర చిరంజీవి యువత తరుపున సాక్షి రిపోర్టర్ ల తరుపున అభినందనలు తెలిపారు.రక్తదానం అనంతరం శ్రవణ్ మాట్లాడుతూ ప్రతి 18 సం నిండిన యువత తప్పకుండ రక్తదానం చేయాలనీ తన కుటుంబానికి తానే రక్తదానం చేసేలాగా అందరూ ముందుండాలని కోరాడు.

# రిజర్వేషన్లపై టెన్షన్

## - నెగ్గేందుకు వ్యూహాలకు పదును - ఇప్పటినుంచే ప్రజలతో మమేకం

## - 'పంచాయతీ'లో పెరిగిన ఆశావాహులు

**సూర్య కోనరావుపేట**

కోనరావుపేట మండలంలోని గ్రామపంచాయతీలో స్థానిక ఎన్నికల సందడి మొదలయ్యింది. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండ దంతో.. ఇప్పటినుంచే ఆశావహులు గ్రామాల్లో ప్రజలతో ప్రేమగా పలకరింపులు ప్రారంభించారు. రిజర్వేషన్ తమకే అనుకూలంగా వస్తుందని.. ఎవరికి వారే ప్రచారాలు చేసుకుంటున్నారు. ప్రజలతో మమేకమై ఓట్ల రాజకీయానికి తెరలేపారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలు, వార్డుమెంబర్ల ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈసారి పాతరిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తారా? లేక కొత్త రిజర్వేషన్లు ప్రకటించి మారుస్తారా! అనేదానిపై సంసిద్ధంలో నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఉన్నారు. గ్రామాల్లో సామాజిక వర్గాలను బట్టి వివిధ రాజకీయ పార్టీల నాయకులు రిజర్వేషన్లను అంచనా వేసుకుంటున్నారు. రిజర్వేషన్ల విషయం తెలిస్తే గ్రామాల్లో పోటీ చేయడానికి రాజకీయ నాయకులు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న పార్టీలో ఉండాలా లేదా వేరే పార్టీలో జంప్ కావాలా అనే సంసిద్ధంలో కొంతమంది రాజకీయ నాయకులు ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరికొంత మంది పార్టీలతో సంబంధం లేకుండా ప్రజలకు ఓటర్లను పలకరిస్తున్నారు. గ్రామకూడళ్ళలో,




చాయ్ హొటళ్ల వద్ద పంచాయితీ ఎన్నికల విషయంపై జోరుగా చర్చించుకుంటున్నారు. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తాయో లేదోనని భావిస్తూనే మరోవైపు కీలక నేతలు సర్పంచులుగా పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. పదేండ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రావడంతో ఆ పార్టీలో నాయకులు స్థానికసంస్థ పై ఎన్నికల జోష్ పెంచుకున్నారు. గతంలో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలుగా ఎక్కువ మంది బీఆర్ఎస్ చెందిన వారే గెలుపొందారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఎన్నో సంవత్సరాల నుంచి పార్టీకి పనిచేసిన వారు ఈసారైనా స్థానిక ఎన్నికలలో తమకు పదవి యోగం ఉంటుందని ఆశలో ఉన్నారు. సర్పంచి, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులపై ఆశలు పెంచుకొని వివిధ పార్టీల నాయకులు పార్టీల పెద్దల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నంలో ఆశావాహులు ఉన్నారు.

**- ఎవరికి కలిసోస్తుందో...**

అధికారంలో ఉన్న పార్టీ మద్దతు ఉంటేనే గెలుపు. సాధ్యమవుతుందని ఆ పార్టీ నుంచి టికెట్ పొందేందుకు ఆశావాహులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరో నాలుగేండ్లు పాటు అధికారంలో ఉంటుంది. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం కలిసొస్తుందని కాంగ్రెస్‌లోని ఆశావాహులు ఉన్నారు. ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్ పంచాయతీ ఎన్నికలపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయకపోవడం వంటి అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తేనే స్థానిక ఎన్నికలలో పట్టు సాధిస్తామని ధీమాలో ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలలో వ్యక్తి ముఖ్యమని పార్టీ కాదని మరి కొందరు వాదిస్తున్నారు. ఏ పార్టీ మద్దతుతో ఎవరెవరికిపోటీ ఉంటుందో గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. రిజర్వేషన్లు అనుకూలిస్తే సర్పంచ్ నీకు, ఎంపీటీసీ నాకు అంటూ లెక్కలు వేసుకుంటున్నారు.

# రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గాలిపల్లి యువకుడు ఎంపిక

**సూర్య, ఇల్లంతకుంట**



రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడ పోటీలకు మండలంలోని గాలిపల్లి గ్రామానికి చెందిన రాగిరి హర్షవర్ధన్ ఎంపికయ్యాడు. ఇటీవల జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన రాగీరు హర్షవర్ధన్ రాష్ట్రస్థాయికి ఎంపికై ఈ నెల 4 నుండి 7 వరకు ఆదిలాబాద్ జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాడు. ఆ యువకున్ని గాలిపల్లి ఈతరం యువజన సంఘం అధ్యక్షులు జి.నరేష్, కార్యదర్శి సాయిగణేష్, వ్యవస్థాపక అధ్యక్షులు ఎంద్ర నారాయణ, ఉపాధ్యక్షులు బట్టు విజయ్, గౌడ సంతోష్, సంఘ సభ్యులు, సీనియర్ క్రీడా కారులు, గ్రామస్తులు హర్షవర్ధన్‌ను అభినందించారు.

# కులగణనను మళ్లీ సర్వే చేయాలి

**సూర్య చందుర్తి**



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే తన సియం పదవికి రాజీనామా చేయాలని టిఆర్ఎస్ నియోజకవర్గ యువజన విభాగం వేములవాడ ఇన్చార్జి ఈర్లపల్లి రాజు డిమాండ్ చేశారు. పోయిన సంవత్సరం ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సభ పెట్టి బీసీల రిజర్వేషన్లు పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని అన్నారు. ఉద్దేశపూర్వకంగానే బీసీ జనాభాను తగ్గించి చూపారు. 42 శాతం సీట్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అంటుంది. కేవలం స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాదు, చట్ట బద్ధత కూడిన రిజర్వేషన్లను అమలు చేస్తేనే అన్నింట్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు అవుతాయి. జనాభాపరంగా దక్కాల్సిన రిజర్వేషన్లను అందకుండా చేసింది. బీసీలను మరోసారి మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. తాజా కుల గణన ప్రకారం బీసీలు ఒక కోటి 85 లక్షల మంది ఉంటే దామాషా ప్రకారం 51 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి కానీ ఇటీవల సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీ జనాభా 46% ఉన్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతుంది. ఇది కచ్చితంగా మోసమే 2014 నాటి సమగ్ర కుటుంబ సర్వేలో 56% ఉన్న బీసీలు తాజా సర్వే నాటికి ఇంత భారీగా ఎలా తగ్గుతారు. కొత్త ఫార్మాట్లో బీసీ కులాలను చేపట్టాలి బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలి లేదంటే ఉద్యమిస్తాం అని అన్నారు.

# సమయపాలన పాటించని అంగన్వాడీ టీచర్స్

## - స్థానికంగా ఉండని అంగన్వాడీ టీచర్లు ఇబ్బందులు పడుతున్న ఆయాలు

## - గర్భిణీలకు అందని పోషక పదార్థాలు అవకతవకలకు పాల్పడుతున్న సిబ్బంది

**సూర్య చందుర్తి**

చందుర్తి మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడి టీచర్లు సమయపాలన పాటించడం లేదని ఆయా గ్రామల అంగన్వాడి కేంద్రాలలోని అంగన్వాడి పిల్లల తల్లిదండ్రులు ఆరోపణలు చేస్తున్నారు. చందుర్తి మండలం బండపల్లి గ్రామములోని మూడు అంగన్వాడీ కేంద్రాలు ఉండగా అందులో రెండో అంగన్వాడీ కేంద్రంలో విధులు నిర్వహి



స్తున్న ఉపాధ్యాయురాలు బుధవారం రోజున సమయానికి రాకుండా ఇష్టాను సారంగా వస్తున్నట్లు స్థానిక ప్రజలు విమ



ర్శలు చేస్తున్నారు. ఇలాగైతే అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు చదువులు ఎలా కొనసాగుతాయని స్థానిక ప్రజలు ప్రశ్నించుకుంటున్నారు. ఇది ఇలా ఉండగా మండ లంలోని వివిధ గ్రామాలలో ఉన్న అంగన్వాడి కేంద్రాల టీచర్లు స్థానికంగా ఉండక సమయానికి అంగన్వాడీ కేంద్రానికి రాక వారు వచ్చేంత వరకు అసిస్టెంట్ అంగన్వాడీలు చూసుకోవలసిన బాధ్యత ఏర్పడిందని వారికి ఇబ్బందిగా మారిం దని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మండలం లోని లింగంపేట గ్రామంలోని ఓ అంగన్వాడి కేంద్రంలో గర్భిణులకు అందించే పోషక పదార్థాలు గుడ్లు, పాలను అందించడం లేదని గర్భిణీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణీలు అంగన్వాడి కేంద్రాలకు వెళ్లి కోడిగుడ్లు ఇవ్వమని అడిగితే కోడిగుడ్లు రావడం లేదని మాటలతో దాటేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన గర్భిణీ ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై చందుర్తి అంగన్వాడి సూపర్వైజర్‌ను వివరణ కోరగా ఈ విషయాలు మా దృష్టికి రాలేదని అంగన్వాడి కేంద్రాలను పరిశీలించి. సమయపాలన పాటించని అంగన్వాడీ టీచర్లపై అలాగే స్థానికంగా ఉండని టీచర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కుక్కల ద్వారా సోకిన వైరస్

**- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి**

**సూర్య కోనరావుపేట**



కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో శునకాల బెడద ఎక్కువ అవుతోంది. కుక్కల కారణంగా ఓ చిన్నారికి వైరస్ సోకడంతో హైద్రాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వివరాలు ఇలాఉన్నాయి. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన చేపూరి శ్రీమేథ (4) అనే చిన్నారికి జ్వరంతో పాటు శరీరంపై అలర్జీ ఏర్పడింది.అవి ఎక్కువ కావడంతో చిన్నారిని సిరిసిల్లలోని ఆస్పత్రికి తరలించారు.అన్ని రకాల పరీక్షలు చేసినా నిర్ధారణ కాకపోవడంతో నాలుగు రోజుల క్రితం హైద్రాబాద్‌లోని ప్రైవేట్ అస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి బ్రూసెల్లా ఇదిపీకల్ వైరస్ గుర్తించారు. కలుషితమైన చికెన్ వ్యర్థాలు, నీటిని తాగడం వల్ల, పచ్చి మాంస వ్యర్థాలు తినడం వల్ల కుక్కలకు సోకుతుందని, అవి తిరిగిన సోకుతుందని, అవి తిరిగిన ప్రదేశాలలో చిన్నారులు తిరిగితే ఈ వైరస్ సోకుతుందని తెలిపారు.కాగా గ్రామంలో గత కొన్ని నెలలుగా కుక్కల బెడద ఎక్కువగా అవుతుందని వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# నూతన కార్యవర్గానికి ఘన సన్మానం

**సూర్య చందుర్తి**



చందుర్తి మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మొకిలె విజేందర్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన మండల కార్యవర్గ సభ్యులకు శాలువా లతో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వేములవాడ అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య పాల్గొని నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులకు, కార్యదర్శులకు,కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ చందుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో భారతీయ జనతా పార్టీని పటిష్ట పరచాలని కోరారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బిజేపి పార్టి బలపరిచిన అభ్యర్థుల్ని గెలిపించుకోనె విధంగా కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు లోకోజీ సతీష్, ఎల్లలా తిరుపతి రెడ్డి, మట్కం మల్లేశం,చందుర్తి ప్రధాన కార్యదర్శులు,మర్రి మల్లేశం,చందుర్తి కార్యదర్శులు అయోధ్య పర్శరాములు, కొక్కుల నరేష్, నాయుని బాపు రెడ్డి, పత్తిపాక శ్రీనివాస్ కార్యవర్గం సభ్యులు గంగిపెల్లి మల్లేశం,ఉగిలే శ్రీనివాస్ సీనియర్ నాయకులు చిలుముల హనుమయ్య చారి, బద్దం తిరుమల్ రెడ్డి,చిర్ల మహేష్, అజమెరా రవి నాయక్, నరగుల సాగర్, గడ్డం రగు, జలగం శ్రీనివాస్ రావు, సుంకి రాజు, ఈగ శ్రీధర్, చక్యాల లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలకై లీగల్ హెడ్ క్లినిక్ దోహదంచేస్తుంది

**- సీనియర్ సివిల్ జడ్జి రాధిక జస్వాల్**

**సూర్య సిరిసిల్ల టౌన్**



విద్యార్థుల న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం లీగల్ హెడ్ క్లినిక్ ఎంతగానో దోహదపడుతుందని సీనియర్ సివిల్ జడ్జి రాధిక జస్వాల్ పిలుపునిచ్చారు.సుప్రీం కోర్ట్,హైకోర్టు ఆదేశాల మేరకు సిరిసిల్ల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లీగల్ హెడ్ క్లినిక్‌ను సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి రాధికా జస్వాల్ ప్రారంభిం చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకునే వయసులో న్యాయ పరమైన సమస్యలు ఎదురైనప్పుడు లీగల్ హెడ్ క్లినిక్ ఎంతగానో దోహద పడుతుందని అన్నారు.

### సభ్యత్వ నమోదులో

# జగిత్యాల జిల్లాను ముందు వరుసలో నిలబెట్టాలి

### - మహిళా కాంగ్రెస్ కరీంనగర్, జగిత్యాల జిల్లా ఇంచార్జి సుగుణ

**సూర్య జగిత్యాల**



సభ్యత్వ నమోదులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో నిలిచిందని, అదే స్ఫూర్తితో జగిత్యాల జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలపాలని కరీంనగర్, జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ ఇంచార్జీ సుగుణ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో జిల్లా మహిళా కాంగ్రెస్ జగిత్యాల విభాగం సభ్యత్వ నమోదు సమావేశం నిర్వహించారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయ లక్ష్మి దేవేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్క లంబా, రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతా రావు ఆదేశాల మేరకు గురువారం సమావేశం నిర్వహించగా, కరీంనగర్, జగిత్యాల జిల్లా ఇంచార్జి సుగుణ హాజరయ్యారన్నారు. గత సెప్టెంబర్ 15 నుండి మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం రోజు నుండి సభ్యత్వం నమోదు ప్రక్రియ ప్రారంభం అయిందన్నారు. సభ్యత్వం నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. మహిళ కాంగ్రెస్ లో జిల్లా విభాగంలో బాధ్యతలు నిర్వహిస్తున్న వారందరు సభ్యత్వం నమోదు చేయించాలని కోరారు. అనంతరం ఇంచార్జి సుగుణ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాకు రావడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చెయ్యడానికి సెప్టెంబర్ 15 న మొదలైన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి మహిళా నాయకురాలు విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం నమోదు ప్రక్రియలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని, జగిత్యాల జిల్లాను సైతం రాష్ట్రం లో ముందు నిలిపేలా ప్రతి ఒక్కరు తమ వంతు తోడ్పాటును అందించాలన్నారు. ఇప్పటివరకు సభ్యత్వం నమోదు చేయని మహిళా కాంగ్రెస్ సభ్యులు సభ్యత్వ నమోదు ప్రక్రియను మొదలు పెట్టాలని సూచించారు. రానున్న రోజుల్లో వచ్చే ఎన్నికలలో అవకాశం వస్తే ప్రతి మహిళా పోరాడాలని, విజయం సాధించాలని సూచించారు. మహిళా కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి దేవేందర్ రెడ్డికి సహకరిస్తు, సభ్యత్వ నమోదును పెంచాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి గడప గడపకు తీసుకెళ్లి అర్థం అయ్యేలా వివరించాలని కోరారు.

## చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి

### - తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

**సూర్య జగిత్యాల**



చేనేత హస్తకళలను అందరు ప్రోత్సహించాలని జగిత్యాల తాజా మాజీ మున్సిపల్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం లోని టౌన్ హాల్ ప్రాంగణంలో చేనేత హస్తకళల హ్యాండ్లుం & హ్యాండిక్రాఫ్ట్స్ చేనేత హస్తకళల ప్రదర్శన స్టాల్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత హస్త కళలు పురాతనమైనవన్నారు. విభిన్న రూపాల్లో సంప్రదాయాలను దాటే చేనేత హస్తకళలను అందరూ ప్రోత్స హించి ఆదరించాలన్నారు. ప్రదర్శన ఉంచిన ఉత్పత్తులు ఎంతగానో ఆకట్టుకుందనీ, ప్రతి ఒక్కరూ ప్రదర్శనను సందర్శించి, ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం నిర్వహకులు చైర్ పర్సన్ సన్మానించారు. ఈ కార్య క్రమంలో వల్లెపు మొగిలి, నాయకులు,చేనేత హస్తకళల నిర్వాహకులు, తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ సిబ్బందిని అభినందించిన ఎస్ఐ

**సూర్య-కోరుట్ల**




కోరుట్ల పట్టణానికి చెందిన చింత చంద్రశేఖర్ గురువారం కాలువ గడ్డ ప్రాంతంలో గల తన ఇంటి నుండి బ్యాగులో బంగారు ఆభరణంతో పాటు ఇతర వస్తువులతో ఉదయం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఇట్టి బ్యాగు మార్గమధ్యలో పడిపోయింది. ఇది గమనించిన చంద్రశేఖర్ వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. వెంటనే బ్లూ కోర్టు పోలీస్ సిబ్బంది అయినా సంజీవ్, శ్రీనివాసులు వెళ్లారు. వారు ఈయన వచ్చిన మార్గంలో ఉన్న సిసి కెమెరాలను పరిశీలించగా మున్సిపల్ సిబ్బంది అయినటువంటి ఎండి సలీం, శనిగారపు సురేష్లు ఆ మార్గంలో వెళ్తుండగా వారికి అట్టి బ్యాగు దొరకడంతో సమీపంలో ఉన్న లతీఫ్ హోటల్లో ఇచ్చినారని తెలుసుకొని బ్లూ కోర్టు సిబ్బంది బ్యాగును పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చారు. వెంటనే ఎస్సై శ్రీకాంత్ అట్టి బ్యాగును సుమారు లక్ష విలువగల బంగారం పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించారు. బ్యాగు అప్పగించిన మున్సిపల్ సిబ్బందినీ,బ్లూ కోర్టు సిబ్బందినీ ఎస్సై శ్రీకాంత్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ధికాని వస్తువులు ఎవరికైనా దొరికితే పోలీస్ స్టేషన్లో అప్పగిస్తే బాధితులను గుర్తించి వారికి అందజేస్తామని ఆయన తెలిపారు.

## ఇటుక బట్టీలను సందర్శించిన సిడిపిఓ

**సూర్య జగిత్యాల అర్బన్**



జగిత్యాల మున్సిపల్ పరిధిలోని తారక రామా నగర్ సమీపంలో గల ఇటుక బట్టిలలో పనిచేసే వారి గృహాలను జగిత్యాల ప్రాజెక్టు సిడిపిఓ మమత గురువారం సందర్శించి అక్కడ తాత్కాలికంగా నివాసం ఉంటున్న లబ్ధిదారులైన ఏడవ నెల నుండి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు బాలామృతం, ఎగ్స్, టి హెచ్ ఆర్ పంపిణీ చేయడం జరిగింది. వేసవి లో తీసుకోవలసిన ఆహారం, ఆరోగ్యం పట్ల జాగ్రత్తల గురించి వారికి వివరించడం జరిగింది.చుట్టుపక్కల పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని,హ్యాండ్ వాష్ గురించి పిల్లలకు తల్లులకు ఇమ్యునైజేషన్ గురించి ప్రతి నెల పిల్లల్ని అంగన్వాడీ కేంద్రానికి తీసుకుని వెళ్లి వారి యొక్క బరువు నమోదు చేయించాలని పిల్లల పట్ల పూర్తి అప్రమత్తతో ఉండాలని తెలియజేషారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లావణ్య, అంగన్వాడీ టీచర్ రజిత, నివాసితులు, తల్లులు, పిల్లలు పాల్గొనడం జరిగింది.

## జిల్లా మహిళా కన్వీనర్‌గా స్రవంతి

**సూర్య కొడిమ్యాల**




జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం లోని పూడూరు గ్రామానికి చెందిన గాదె స్రవంతి ని బీసీ సాధికారత సంఘం జగిత్యాల జిల్లా మహిళా కన్వీనర్‌గా రాష్ట్ర బీసీ సాదికారత సంఘం కమిటీ నియమించింది. జిల్లాలో బీసీల ఐక్యత కోసం పని చేసి బీసీల హక్కుల కోసం పోరాడాలని స్రవంతికి రాష్ట్ర కమిటీ సభ్యులు సూచించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ అందరి సహకారంతో పని చేస్తు బీసీల ఐక్యత కోసం పని చేస్తానని సహకరించిన రాష్ట్ర బీసీ సాధికారత సంఘం గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్యకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాజినేని రాజేందర్‌కు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ పొలాస నరేందర్‌లకు కృత్ఞతలు తెలియజేశారు.

## ఎన్ డి ఆర్ ఎఫ్ బృందంచే అవగాహన సదస్సు

**సూర్య ఇబ్రహీంపట్నం**



ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గురువారం ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ ముఖేష్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాలు విపత్తులు వరదలు ఫైర్ రోడ్డు ప్రమాదాలు గాయపడి వారికి సిపిఆర్ చేయడం అగ్ని ప్రమాదాలు చెరువులలో వరదలలో ప్రమా దాలు జరిగినప్పుడు కొట్టుకుపోవడం వాటి నుండి మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి భయపడకుండా సమర్ధవంతంగా ఎలా ఎదుర్కోవాలి ఎలా అప్రమత్తంగా ఉండాలి అనే అంశాల వాటిపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎమ్మార్వో,ఎంపీడీవో,ఎంఈఓ పాల్గొన్నారు.

## ఎల్వోసి అందజేసిన ఎమ్మెల్యే

**సూర్య జగిత్యాల**



జగిత్యాల పట్టణంలోని 17వ వార్డుకి చెందిన గుండారపు రాజశేఖర్ గుండె సంబంధిత వ్యాధితో భాదపడుతుండగా స్థానిక యువ నాయకులు ప్రభాత్ సింగ్ ఠాగూర్ రాజశేఖర్ ఆరోగ్య పరిస్థితిని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. నిమ్స్ హాస్పిటల్‌లో గుండె శస్త్ర చికిత్స నిమిత్తం 2 లక్షల 50 వేల రూపాయల ఎల్వోసిని రాజశేఖర్ కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లో జగిత్యాల శాసనసభ్యులు డా.సంజయ్ కుమార్ అందజేశారు.

## మున్సిపల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

**సూర్య, కోరుట్ల టౌన్**



సంపూర్ణ సురక్ష కేంద్రం వారి ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు రక్త పరీక్షలు నిర్వహించారు. హెల్త్ క్యాంపు నిర్వహించిన డిప్యూటీ డిఎంహెచ్ఓ గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ డాక్టర్ సునీత రాణి మరియు సిబ్బందికి మున్సిపల్ కమీషనర్ బట్టు తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, మున్సిపల్ సిబ్బంది, గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్ శృతిలయ, డాక్టర్ వినోద్, ఐ సి టి సి మేనేజర్ సంతోష్, ఫార్మసిస్ట్ ప్రవళిక, ల్యాబ్ టెక్నీషియన్ సాజిద్ అలి, శ్రీధర్, రమ్య, నాగరాజ్, శంకర్, రాజేష్ TB సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు, పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

## రక్త దానం చేసిన యువకుడు

**సూర్య - కథలాపూర్**



మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన తోపారపు నర్సయ్య అనే యువకుడు మంగళవారం ఓ మహిళకు రక్త దానం చేశారు. అదే గ్రామానికి చెందిన అరుణ అనే మహిళకు కోరుట్ల ప్రైవేటు దవాఖానలో శాస్త్ర చికిత్స నిమిత్తం రక్తం అవసరం కాగా ఓ పాజిటివ్ రక్తంను ఆయన వైద్యుల సూచన మేరకు అందజేశారు. కాగా రక్త ధాతను మాజీ ఎంపిపి నాంపల్లి లింబాద్రి, మండల బిజెపి అధ్యక్షుడు మల్యాల మారుతిలు అభినందించారు.

## కుక్కల దాడిలో గొర్రెలు మేకలు మృతి

**సూర్య మేడిపల్లి/బీమారం**



మండలంలోని కమ్మరిపేట్ గ్రామానికి చెందిన బైరీ లింగన్న గొర్రెలు మేకలపై గురువారం రోజు కుక్కలు దాడి చేసిన ఘటనలో సుమారు 4లక్షల విలువ గల 45గొర్రెలు మేకలు మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకొన్న బీమారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి కమ్మారిపేట్‌లోని బైరి లింగన్న ఇంటికి వెళ్ళి పరా మర్శించారు.ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట కమ్మరిపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ చుక్క తిరుపతి, బీమారం గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ భక్కూరి నరేష్, ఉరు మడ్ల లక్ష్మణ్, రెడ్ల మధు, బార్కం శేఖర్, పెద్దిరెడ్డి స్వామి రెడ్డి, సంజీవ్‌లు ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఎల్ రమణను బీర్పూర్ జాతరకు ఆహ్వానించిన బిఆర్ఎస్ నాయకులు

**సూర్య బీర్పూర్**



హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వర్టర్స్‌లో ఎమ్మెల్సీ ఎల్. రమణను బీర్పూర్ మండలం బిఆర్ఎస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జగిత్యాల జిల్లాలో ఈనెల 9వ తేదీ నుండి జరుగబోయే బీర్పూర్ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవ మహోత్సవానికి రాగలరని ఎమ్మెల్సీకి బీర్పూర్ మండల నాయకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొల్ముల రమణ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణలో నేతకానీలకు తీవ్ర అన్యాయం

**- రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణలో పునరాలోచన చేయాలి**

**- సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నేతకాని కులస్తులను తీవ్రంగా అన్యాయం చేసిందని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్ ఆరోపించారు. నేతకానీ సంఘం పెద్దపల్లి జిల్లా ఇన్చార్జి పేగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయాన్ని నిన్నటి క్యాబినెట్లో ఆమోదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. 15 లక్షల పైగా ఉన్న నేతకానిలను కేవలం ఒక లక్షా ముప్పై వేల జనాభాగా చూపించడం దారుణమన్నారు. వర్గీకరణకు తాము వ్యతిరేకంకామని, వర్గీకరణ అనివార్యమైతే జనాభామాస ప్రకారం ఎవరికీ ఎంత వాటర్ రావాలో దాన్ని పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టి వర్గీకరణ చేస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని అన్నారు. వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు కేవలం సలహా మాత్రమే ఇచ్చిందని,



దాన్ని బూచిగా చూయించి తప్పులతడకల సర్వేలతో వర్గీకరించి నేతకానిలను అవమానించారని మండిపడ్డారు. నేతకానిలు ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండడం వల్ల భూమిపై హక్కు లేక, రాజకీయ రిజర్వేషన్ లేక, చదువుకున్న ఉద్యోగాలు రాక నేతకానిలు ఇంకా ఈ 77 సంవత్సరాల స్వతంత్ర భారత దేశంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎటువంటి అభివృద్ధి చెందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల జనాభాను కూడా తక్కువగా చూపించారని, ఎక్కువ జనాభా కలిగిన కులాలను తక్కువగా తక్కువ జనాభా కలిగిన కులాలను ఎక్కువగా జనాభా ఉన్నట్లుగా చూయించడం సరికాదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ విషయంలో పునరాలోచన చేసి, కులగలను విషయంలో ప్రత్యేక అధికారిని నియమించి వారి వారి జీవనస్థితిగతులను అధ్యయనం చేసి వారి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ పెంచాలని కోరారు. లేనియెడల ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. నేతకానీల హక్కుల సాధనకు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నామని త్వరలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో నేతకాని మహార్ ముఖ్య నాయకులతో నేతకానిల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి నేతకానీలు, నేతకానీ ఉద్యోగస్తులు, యువకులు, అంబేద్కర్ వాదులు, మహిళా నాయకులు, నేతకాని ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, డివిజన్, నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతకాని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామెర ప్రకాష్, పెద్దపల్లి జిల్లా నాయకులు కుమ్మరి మల్లేష్, కుమ్మరి యువరాజ్, కామేర పద్మ, మాదాసు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కమాన్‌పూర్ మండలంలో ఎంపీటీసీ స్థానాల జాబితా వివరాలు

**సూర్య, సెంటినరీ కాలనీ**

కమాన్ పూర్ మండలంలో ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేస్తూ.. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు నోటీసు బోర్డులో తుది జాబితాను ఎంపీడీవో అధికారికంగా ప్రకటిస్తూ.. అంటించారు. ఆ జాబితాలో.. కమాన్ పూర్ ఎంపీటీసీ స్థానాలు ఏమిటి.. వాటి పరిధిలో గల గ్రామ పంచాయతీలు ఎన్ని.. అలాగే వార్డుల సంఖ్య ఎంత.. 2011 జనాభా లెక్కల ప్రకారం జనాభా వివరాలు వెల్లడించారు. కమాన్ పూర్ మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారంగా 25,005 జనాభా ఉన్నట్లు ప్రకటించారు. గుండారం ఎంపీటీసీ స్థానం పరిధిలో గుండారం గ్రామ పంచాయతీ పరిధిలో 10 వార్డులు, పేరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 8 వార్డులు, గొల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 8 వార్డులు కలవు. (గుండారం ఎంపీటీసీ స్థానం పరిధిలో 4292 జనాభా కలదు). జూలపల్లి ఎంపీటీసీ -1 స్థానం పరిధిలో జూలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 7 వార్డులు కలవు. (జూలపల్లి -1 ఎంపీటీసీ స్థానం పరిధిలో 3213 జనాభా కలదు). జూలపల్లి ఎంపీటీసీ - 2 స్థానం పరిధిలో మరో మిగతా 7 వార్డులు కలవు.(జూలపల్లి - 2 ఎంపీటీసీ స్థానం పరిధిలో 3090 జనాభా కలదు), కమాన్ పూర్ ఎంపీటీసీ -1 స్థానం పరిధిలో కమాన్ పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 8 వార్డులు కలవు. (కమాన్ పూర్ ఎంపీటీసీ -1 స్థానం పరిధిలో 4109 జనాభా కలదు), కమాన్ పూర్ ఎంపీటీసీ - 2 స్థానం పరిధిలో కమాన్ పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మిగతా 6 వార్డులు, సిద్దిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని 8 వార్డులు కలవు. (కమాన్ పూర్ ఎంపీటీసీ -2




స్థానం పరిధిలో 4011 జనాభా కలదు), పెంచికల్ పేట్ ఎంపీటీసీ స్థానం పరిధిలో పెంచికల్ పేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని 10 వార్డులు, నాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని 10 వార్డులు కలవు. (పెంచికల్ పేట్ ఎంపీటీసీ స్థానం పరిధిలో 3737 జనాభా కలదు), రొంపికుంట ఎంపీటీసీ స్థానం పరిధిలోని రొంపికుంట గ్రామ పంచాయతీలో గల 10 వార్డులు కలవు.(రొంపికుంట ఎంపీటీసీ స్థానం పరిధిలో 2553 జనాభా కలదు), అధికారులు స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఎంపీటీసీ స్థానాలు ప్రకటించి.. జాబితా.. వెల్లడించడంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించడానికి సంసిద్ధంగా ఉన్నట్లు స్పష్టమవుతుంది.

## గ్రామాల అభివృద్ధితో పాటు శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలి

**- ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేయాలి**

**- జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య**

**సూర్య, సెంటినరీ కాలనీ**



గ్రామాల అభివృద్ధితో పాటు శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. రామగిరి మండలం నాగేపల్లి గ్రామపంచాయతీలో పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఆకస్మికంగా పర్యటించి తనిఖీ చేశారు. గ్రామంలోని ఓపెన్ ప్లాట్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇంటి పన్ను వసూలు 100 శాతం పూర్తి చేయాలని, సెక్రటరీ తమ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి ఇంటి పన్ను వసూలు చేయాలని ఆయన సూచించారు. అలాగే పెండింగ్ లో ఉన్న అన్ని రకముల పౌర సేవలు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పెద్దపల్లి స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

## భారత సైన్యంలో చేరడానికి సదావకాశం

**సూర్య, సెంటినరీ కాలనీ**



భారత సైన్యంలో చేరడానికి సదవకాశమని కమాన్పూర్ గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాశి మల్ల సుధాకర్ అన్నారు. గురువారం కమాన్ పూర్ పోలీసు అధికారులు భారత సైన్యంలో చేరడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ.. చేరే వారి అర్హత 10వ తరగతి ఉత్తీర్ణత తో 166 సెం.మీ ఎత్తు ఉండాలన్నారు. 55 కిలోల బరువుతో పాటు 17 సంవత్సరాల 6 నెలల నుండి 21 సంవత్సరాల వరకు (20 ఫిబ్రవరి 2004 నుండి 20 ఆగస్టు 2007 వరకు వయస్సు) కలిగి ఉండాలన్నారు. ఆధార్ జిరాక్స్, పాస్ పోర్ట్ సైజు 4 ఫోటోలు, పదో తరగతి మెమో జిరాక్స్, కుటుంబ రేషన్ కార్డు ప్రతులను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాశీమల్ల సుధాకర్, ఏఎస్ఐ ఖలీల్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్ బాబన్న, లెక్చరర్లు తిక్క రమేష్, డాక్టర్ జాలిగం రమేష్, బండ భీమయ్య, ముంజం బాబూరావు, వావిలాల హేమచంధర్, లైబ్రేరియన్ కె. నగేష్ విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

**- మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్న తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్లాస్టిక్ రహిత పెద్దపెల్లిగా తీర్చిదిద్దేందుకు ముందుకు రావాలని పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ అన్నారు. గురువారం పట్టణంలోని వర్తక వ్యాపారులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్ధాల కారణంగా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. వీధుల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్ధాలు తిరిగి పశువులు మృతి చెందుతున్నాయని తెలిపారు. అందరూ సహకరిస్తేనే ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యమని అన్నారు. ఇప్పటికే పలుమార్లు దుకాణ యాజమాన్లకు ప్లాస్టిక్ కవర్లు వినియోగించాలని హెచ్చరించామని తెలియజేశారు. దుకాణ యజమానులు ట్రేడ్ లైసెన్స్ పొంది ఉండాలని ఇప్పటివరకు ట్రేడ్ లైసెన్స్ లేని వారు 15 రోజుల్లో తీసుకోవాలనీ తెలిపారు. రెడ్ లైసెన్స్ పై సందేహాల కోసం హెల్ప్ లైన్ నెంబర్ 6303127483 సంప్రదించాలని అన్నారు. ఈకార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, సురేందర్,వార్డు ఆఫీసర్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ పెద్దపల్లి అధ్యక్షులు కమల్ కిషోర్, జనరల్ సెక్రటరీ సయ్యద్ మస్రత్,కోశాధికారి జయప్రకాష్, కిరాణం అసోసియేషన్ సతీష్,దీపరామ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ

**సూర్య- సుల్తానాబాద్**



హన్మకొండ బార్ అసోసియేషన్ న్యాయవాది గంధం శివపై ట్రాఫిక్ పోలీస్ ఇన్స్పెక్టర్ సీతారాం రెడ్డి బృందం చేసిన దాడిని ఖండిస్తూ గురువారం సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. దాడి చేసిన పోలీసులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్‌లతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## నాన్ ఆప్టెడ్ క్వార్టర్స్ కొరకు కౌన్సిలింగ్ నిర్వహణ

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థ ఆర్జీ-2 డివిజన్ 8వ కాలనీ లోని సిఇఆర్ క్లబ్ నందు ఓసీపీ-1, జీడీకే 11 ఇంక్లైన్ ఉద్యోగులకు నాన్ అప్టేట్ క్వార్టర్స్ కొరకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ క్వార్టర్ కౌన్సిలింగ్‌లో 310 క్వార్టర్లకు గాను 30 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా 10 మంది ఉద్యోగులు హాజరై క్వార్టర్లు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ శాంసన్, డీజీఎం (పర్సనల్) ఎస్.అనిల్ కుమార్, సివిల్ ఈఈ రాజు, డివైపిఎం వంశీధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘన సన్మానం...

**సూర్య-పెద్దపల్లి రూరల్**



నూతన బాధ్యతలు స్వీకరించిన పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో పెద్దపల్లి మండల మీసేవ సంఘ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మిట్టపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగునూరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగుల మల్లేశం, సొల్లూరి రాజేందర్,కుకుమల్ల సత్యనారాయణ,కన్నం తిరుపతి,బంక భూమేష్,గుడికందుల సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను పట్టించుకోకపోతే ఇచ్చిన ఆస్తులు వాపస్

## - రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాసులు

**సూర్య-గోదావరిఖని**

తల్లిదండ్రుల చేత ఆస్తుల్ని రాయించుకొని, వృద్ధాప్యంలో వారి బాగోగులను పట్టించుకోకుండా... వారి పట్ల కర్కశంగా వ్యవహరించే వారసులకు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు హెచ్చరిక జారీ చేశారు. తల్లిదండ్రుల సంరక్షణ పరంగా బాధ్యతారాహిత్యంగా వివరించే బిడ్డల విషయంలో చట్టాలు కఠినంగా ఉన్నాయని, ఇచ్చిన ఆస్తులను వెనక్కి తీసుకునే అధికారం ఉంటుందని తెలిపారు. ఈ మేరకు గురువారం తన కుమారులు తమను పట్టించుకోవడం లేదంటూ ఓ వృద్ధ జంట సీపీని ఆశ్రయించారు. మంథని ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన గుజ్జుల సాయిలు, అతని భార్య చిలకమ్మ ఇద్దరు తమ బాధను వెలిబుచ్చారు. వారి పెద్దకొడుకు మల్లికార్జున్ ఆర్మీ లో ఉద్యోగం చేస్తున్నాడని ఇతనికి రెండు



ఎకరాల పొలం, చిన్న కొడుకు రమేష్ విద్యుత్ శాఖ లో లైన్ మెన్ గా పని చేస్తున్నాడని, ఇతనికి ఎకరంనర భూమిని ఇచ్చినట్లు వారు తెలిపారు. ఇట్టి పొలాలను కొనుగోలు చేసిన సమయంలో రూ.10 లక్షల వరకు అప్పు అయ్యిందని, ఇప్పుడు తాము ఆ అప్పు కట్టే పరిస్థితుల్లో లేమని సీపీ ఎదుట మొరపెట్టుకున్నారు. వారి కుమారులు తమ బాగోగులు పట్టించుకోవడంలేదని, కనీసం తినడానికి తిండి, నిత్యవసరాలకు కూడా డబ్బులు ఇవ్వడం లేదంటూ ఫిర్యాదు చేశారు. ఆ వృద్ధుల బాధలు విన్న సీపీ వెంటనే వారి పిల్లలను పిలిచి వారి సమస్యను పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ వృధ్యాప్యంలో ఉన్న తల్లిదండ్రుల విషయంలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా పార్లమెంటు ఓ చట్టాన్ని రూపొందించిందని, వృద్ధ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం, మెయింటెనెన్స్ యాక్ట్-2007 పేరుతో దీన్ని అమలులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కేంద్రం రూపొందించిన చట్టానికి అనుగుణంగా వివిధ రాష్ట్రాల్లో నిబంధనలు రూపొందించారని తల్లిదండ్రుల విషయంలో పిల్లలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చట్టం చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు.

## కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించాలి

### - డిప్యూటీ పారామెడికల్ అధికారి దేవి సింగ్

**సూర్య, కాల్వ శ్రీరాంపూర్**



కుష్టి వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి బి దేవి సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని క్రీసెంట్ ప్రైవేటు పాఠశాలలో కుష్టు వ్యాధి నివారణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి దేవి సింగ్ మాట్లాడుతూ శరీరం పైన మొద్దు బారిన మచ్చలు ఏర్పడి స్పర్శ లేకపోవడం, రాగి రంగు వర్ణంతో ఉండి శరీరం పాలిపోవడం, మచ్చలపై చెమటలు రాకపోవడం తదితర సమస్యలు ఉన్న వాటిని కుష్టివ్యాధిగా నిర్ధారించాలి అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వం ప్రజా ఆరోగ్య శాఖ జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు స్లాక్ కార్యక్రమమ ద్వారా కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాలు అన్ని ఉన్నత పాఠశాలల్లో నిర్వహించడం జరుగుతుంది అన్నారు. కుష్టి వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా ఉంటుంది అన్నారు. కుష్టి వ్యాధి ఉంటే ఆ వ్యక్తికి ఎండిటి చికిత్స ద్వారా వైద్యం అందించవచ్చును అన్నారు. అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు లభిస్తాయి అన్నారు. అందులో భాగంగా క్రీసెంట్ పాఠశాలలో కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, పి హెచ్ ఎన్ భాగ్యలక్ష్మి, హెచ్ ఈ ఓ శ్రీనివాస్ వినీత్, ఏఎన్ఎం సరోజన, ఆశాలుశారద, సరోజన, భూలక్ష్మి, మౌనిక, హెచ్ఎం నసీర్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంఎస్సి క్లినికల్ న్యూట్రిషన్ డైటెటిక్స్ ఫలితాలలో డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి ప్రతిభ

**సూర్య జగిత్యాల**



నాక్ ఎ ప్లస్, యుజిసి గుర్తింపు కలిగిన కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఓపెన్ విశ్వవిద్యాలయం మైసూరు గురువారం ఫిబ్రవరి 6 రోజున ఎం.ఎస్.సి.క్లినికల్ న్యూట్రిషన్, డైటెటిక్స్ కోర్సు ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల్లో ప్రముఖ పునరావాస మనస్తత్వవేత్త డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి 71% మార్కులు సాధించి అసాధారణ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డా.సి.అనిత డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ ఛైర్ పర్సన్ డా.శ్రీనివాస్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తూ, పోషకాహారం మానసిక ఆరోగ్యం రంగంలో మీ కృషి ఎంతో మందికి మార్గదర్శకంగా నిలుస్తుంది అని ప్రశంసించారు. డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ రెనె హాస్పిటల్‌లోని న్యూట్రిషన్, డైటెటిక్స్ విభాగంలో 60 రోజుల పాటు ఇంటర్న్షిప్ విజయవంతంగా పూర్తి చేసినట్లు, ఈ సమయంలో రోగులకు సముచిత పోషకాహారం సూచించడంతో పాటు థెరప్యూటిక్ న్యూట్రిషన్, మెటబోలిక్ డిజార్డర్స్‌కు సంబంధించిన ప్రత్యేకమైన డైట్ ప్లాన్స్ సూచించడం జరిగిందని, క్లినికల్ న్యూట్రిషన్, మానసిక ఆరోగ్యం పరస్పరం అనుసంధానమైన శాస్త్రాలుగా ఉన్నాయి. భవిష్యత్తులో ఈ రంగంలో మరింత పరిశోధన చేసి, సమాజానికి ఉపయోగకరమైన మార్గదర్శక విధానాలను రూపొందించేందుకు కృషి చేస్తాను అని తెలియజేశారు. డా. అట్ల శ్రీనివాస్ రెడ్డికి డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్ ప్రొఫెసర్‌లు డా ఎం.ఎస్.హేమలత, డా. కృష్ణ రాజ్, డా.గౌతమ్, డైటీషియన్‌లు, మానసిక నిపుణులు తదితరులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో మానసిక వైద్య నిపుణుల ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు

**సూర్య కరీంనగర్ టౌన్**



స్థానిక కరీంనగర్ లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ హై స్కూల్‌లో మానసిక వైద్య నిపుణులు డా. రమణాకర్ రెడ్డి యోగ ఆసనాల ద్వారా శారీరక శ్రమ ద్వారా ఆటపాటల ద్వారా పిల్లల మానసిక ఒత్తిడిని ఎలా తగ్గించాలో తెలియజేశారు.విద్యార్థులకు మంచి నిద్ర, ఆహారపు అలవాట్ల ద్వారా ఒత్తిడిని నియంత్రించవచ్చని తెలియజేశారు. కలెక్టర్ గారి ఆదేశం మేరకు అన్ని పాఠశాలల్లో పిల్లలకు ఒత్తిడి తగ్గించడం కొరకు ప్రయత్నం జరుగుతుంది అన్నారు. చాలా పాఠశాలలు తిరిగాను కానీ ఇంతమంచి పాఠశాలను చూడలేదన్నారు.ఇట్టి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు పాఠశాల అధ్యక్షులు బల్మూరి కరుణాకర్ రావు, కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సహ కార్యదర్శి కొండ గంగాధర్, సమితి అధ్యక్షులు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారని పాఠశాల ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి తెలిపారు.

## సెకండ్ ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**సూర్య సిరిసిల్ల టౌన్**



రాష్ట్ర ఏఐటీయూసీ పిలుపులో భాగంగా సెకండ్ ఏఎన్ఎంలు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. 18 సంవత్సరాలుగా ఆరోగ్య కేంద్రాలలో సెకండ్ ఏఎన్ఎంలుగా సేవలందిస్తున్న వారందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తూ,రెగ్యులర్ చేయాలని కోరారు. అనేక సంవత్సరాల తరువాత రెగ్యులర్ ఏఎన్ఎం పోస్టుల నోటిఫికేషన్ విడుదలైనందున అదనంగా పోస్టుల సంఖ్యను పెంచి కాంట్రాక్టు బేసిక్ లో పని చేస్తున్న వారికి రెగ్యులర్ అయ్యేలా చూడాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.రాత పరీక్ష ద్వారా అర్హత సాధించని వారికి 100% గ్రాస్ శాలరీ ఇవ్వాలని, 10 లక్షల లైఫ్ టైమ్ గ్రాట్యుటీ,10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్,10 లక్షల ఆక్సిడెంట్ ఇన్సూరెన్స్,7 నెలల పిఆర్ సి ఏరియస్ వేతనం,అవసరం ఉన్న వారికి ట్రాన్స్ఫర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు,అధ్యక్షులు అజ్జ వేణు, సెకండ్ ఏఎన్ఎంలు స్వప్నదేవి,వినోద,మంజుల, సరితా, పుష్పలత, రాజేశ్వరి,బి.పూజిత,సువర్ణ, భారతి,పుష్పలత,అమృతాదేవి పాల్గొన్నారు.

## 10వ తేదీన అద్దె వాహనాల టెండర్లకు డ్రా నిర్వహణ

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో ఆరు (ఫోర్ వీల్) డ్రైవ్ జీపులకు టెండర్లు పిలవగా 1329 మంది టెండర్లు వేశారు. దీనికి గాను ఈ నెల 10వ తేదీన జీఎం కార్యాలయంలో డ్రా నిర్వహించనున్నారు.

## బిఆర్ఎస్ కుటుంబాన్ని పరామర్శించిన...

### - బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

**సూర్య వీర్నపల్లి**



వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన అజ్మీర పండరి కుమారుడు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య గురువారం పరామర్శించారు. మనోధైర్యాన్ని కల్పించారు. అధైర్య పడవద్దు అని అన్నారు. ఆయన వెంట వీర్నపల్లి మండల అధ్యక్షుడు గుజ్జుల రాజి రెడ్డి, వీర్నపల్లి బిఆర్ఎస్ నాయకులు మీసం రాజం,గ్రామ శాఖ అధ్యక్షులు రాజు, దేవయ్య, దర్శింగు, సీనియర్ నాయకులు రంజిత్ కుమార్, సుధీర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎలగందుల చిరంజీవి ఉన్నారు.

## రంగస్థల కళాకారుడు చంద్రయ్యకు పలువురి సంతాపం

**సూర్య, హుజురాబాద్**

ఇటీవల మృతి చెందిన హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన రంగస్థలం కళాకారుడు శ్రీపాద చంద్రయ్య కుటుంబానికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. హుజురాబాద్ ప్రాంతంలోనే చిరుతల రామాయణం కళాకారుడుగా శ్రీపాద చంద్రయ్యకు ఎంతో పేరుంది. ఈ ప్రాంతంలోని పలువురికి ఆయన చిరుతల రామాయణం నేర్పించారు. ఎంతో మంది శిష్యులు ఆయన వద్ద నేర్చుకొని ప్రదర్శనలు ఇచ్చారు. కాగా ఇటీవల ఆయన గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు మేకల తిరుపతి, బిజెపి సీనియర్ నాయకుడు మోతి తిరుపతి, సీనియర్ జర్నలిస్టు మండల యాదగిరి, మాజీ సర్పంచ్ ఆకుల మొగిలి తదితరులు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

## ఎలబాకలో కాంగ్రెస్ నూతన కమిటి

**సూర్య, వీణవంక**



వీణవంక మండలంలోని ఎలబాక గ్రామంలో నూతన కమిటీ మండల అధ్యక్షులు ఎక్కటి రఘు పాల్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని వేయడం జరిగింది. గ్రామ శాఖ అధ్యక్షులు తోకల సంప త్ రెడ్డి, గ్రామ ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్, కొత్తిరెడ్డి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఊట్ల దేవదాస్, సంయుక్త కార్యదర్శి ఎలవేని సాయి కుమార్, కార్యదర్శి ఫీర్ మమ్మద్, కోశాధికారి రాజిరెడ్డి, ప్రచార కార్యదర్శిగా సంపత్ రెడ్డిలను ఎన్నుకోవడం జరిగింది.

## ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడిగా గుండెల్లి కళ్యాణ్ కుమార్

**సూర్య గంభీరావుపేట**



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన గుండెల్లి కళ్యాణ్ కుమార్ ఎస్ఎఫ్ఐ సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడిగా గురువారం నియామకమయ్యారు రాష్ట్ర కమిటీ జిల్లా నాయకత్వం విద్యార్థులు నాపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్షుడిగా మరో సారి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విద్య రంగ సమస్యలపై నిరంతరం పోరాడుతనాని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలు పరిష్కరించే వరకు నా వంతుగా పాత్ర పోషిస్తానని కళ్యాణ్ కుమార్ పేర్కొన్నారు.

## ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశం

**సూర్య ఓదెల**

ఓదెల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశానికి మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. వై రమేష్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించగా సమావేశంలో నాణ్యమైన విద్య, నాణ్యమైన మిడ్ డే మీల్స్, పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల పరీక్షల సన్నదత, స్పెషల్ క్లాస్, స్లిప్ టెస్ట్, స్లో లెర్నర్ అడాప్షన్, వేక్ అఫ కాల్స్ మొదలగు అంశాల గురించి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో బి సాంబయ్య, క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీమతి పద్మ తోపాటు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామాలలో వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**సూర్య గంగాధర**

గ్రామాల్లోని ప్రజలకు అన్ని రకాల వ్యాధులపై అవగాహన కల్పించాలని ఎంపీ ఓ జనార్దన్ రెడ్డి అన్నారు.భారత ప్రభుత్వం చేపట్టిన టీబి ముక్త్ అభియాన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని టీబి ముక్త్ గ్రామపంచాయతీ కార్యక్రమంలో భాగంగా నేడు ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శిలకు టీబి ఫ్రీ గ్రామ పంచాయతీ కాన్సెప్ట్ పైన ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తం, జిల్లా అధికారి ప్రభాకర్, ఎంపీడీఓ రాము, జడ్పీ జిల్లా శిక్షణా మేనేజరు కోట సురేందర్ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో




భాగంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అందరూ ఈ క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మండలం లోని అన్ని గ్రామాలను టీబి ఫ్రీ గ్రామాలుగా మార్చడానికి అందరి సహాయ సహకారాలు ఎంతైనా అవసరం ఉందన్నారు. ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాను టీబి రహిత జిల్లాగా చేయడానికి జిల్లా క్షయ నివారణ విభాగం, జనరల్ హెల్త్ స్టాఫ్ తో కలిసి కొత్త కేసులను గుర్తించేందుకు ఉన్న కేసులను సక్రమంగా మందులు వాడి ట్రీట్మెంట్ సక్సెస్ రేట్ పెంచేందుకు పి ఆర్ ఐ ఇన్స్టిట్యూషన్స్ తో కలిసి గ్రామాలలో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 2025 జీపీడీపీ ప్రణాళిక లో కూడా టీబీ నివారణ ఆక్టివిటీస్ పొందు పరుచాలీ అని పేర్కొన్నారు. వెయ్యి జనాభా గల గ్రామంలో 30 టెస్టులు చేస్తే 0 లేదా 1 వరకు రావాలి అట్లే ముక్త గ్రామంలో 6 సూచీకలు ప్రకారం నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి మండలంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసి వారి ద్వారా గ్రామ సభలు, ఎస్ హెచ్ జి ఏంజివో కమిటీలకు అవగాహన కల్పించి టీబి ఫ్రీ పంచాయతీలుగా చేయడానికి కృషి చేస్తామన్నారు.

# బీసీ సాధికారిత సంఘం మండల కమిటీల నియామకం

**సూర్య వేములవాడ**

వేములవాడ పట్టణంలోని ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన బీసీ సాధికారిత సంఘం కార్యాలయంలో జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ అధ్యక్షతన జిల్లా బీసీ సాధికారిత సంఘం సమావేశం నిర్వహించారు. రాజన్న సిరిసిల్లా జిల్లాలోని బీసీ సాధికారిత మండల కమిటీలను, మండలాలవారిగా మండల అధ్యక్షులను, ప్రధాన కార్యదర్శులను ప్రకటించి, నియామక పత్రాలు అందజేశారు. అనంతరం వారికి రాష్ట్ర బీసీ సాధికారిత సంఘం గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమావేశంలో కొండ దేవయ్య మాట్లాడుతూ జిల్లాలో బీసీ సాధికారిత సంఘం పటిష్టవంతంగా ఉండుటకు, బీసీలను ఐక్యపరుచుటకు బీసీల సంక్షేమం కోసం వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయుటకై జిల్లాలో మండలాలవారిగా మండల అధ్యక్షులను, ప్రధాన కార్యదర్శులను నియమించడం జరిగిందని పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్లా జిల్లాలోనే కాకుండా ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటుగా ఉత్తర తెలంగాణ జిల్లాలలో బీసీ



సాధికారిత సంఘంను బలోపేతం చేస్తామని కొండ దేవయ్య అన్నారు. జిల్లా బీసీ సాధికారిత సంఘం సమావేశానికి అధ్యక్షత వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పోలాస నరేందర్ మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా ఉపాధి పరంగా, తదితర రంగాలలో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో బీసీ సాధికారిత సంఘం పని చేస్తుందని నరేందర్ అన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికపై రిజర్వేషన్లు కల్పించాలన్న, బీసీలకు రాజ్యాధికారం రావాలన్నా, రోజురోజుకు అంతరించి పోతున్న కుల చేతి వృత్తులకు కాపాడుకోవాలన్న, బీసీ కులాలకు కులవృత్తుల ద్వార పూర్వవైభవం రావడం కొరకు బీసీలు ఐక్యంగా శ్రమించాల్సిన అవసరం ఎంతో ఉన్నదనీ, ఆ సమయం ఆసన్నమైందని పొలాస నరేందర్ బీసీ సంఘాలకు పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ కుల సర్వే పారదర్శకంగా, పటిష్టవంతంగా, సృజనాత్మకంగా, సంపూర్ణంగా జరుగనందున మళ్లీ సర్వే చేయించాలని ప్రభుత్వాన్ని నరేందర్ కోరారు. జగిత్యాల జిల్లా బీసీ సాధికారిత సంఘం జిల్లా మహిళ అధ్యక్షురాలుగా పూడూరు గ్రామానికి చెందిన గాదె శ్రావంతిని నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేసి, సన్మానించారు.ఈ సమావేశంలో తీగల శేఖర్ గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, గాదె శ్రావంతి జగిత్యాల చేను జిల్లా మహిళ అధ్యక్షురాలు,గుజ్జెల శివరాం జిల్లా యువత ప్రధాన కార్యదర్శి,ఇల్లందు వెంకటేష్ పట్టణ ప్రధాన కార్యదర్శి, రౌతు స్వప్న,సిరిగిరి గాయిత్రి,పావని గౌడ్,అనురాధ, కుంభం రవీందర్,ఉయ్యాల భూమయ్య, చేను హెలపతితో పాటుగా తదితరులు పాల్గొన్నారు.



# దళితుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

**సూర్య సిరిసిల్ల టౌన్**




కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత సంక్షేమానికి నిధుల కోతతో పాటు, దళితులపై దాడులు కొనసాగుతున్నా యని, దళితుల రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాజన్న సిరిసిల్ల జిల్లా సమావేశం మంద సుదర్శన్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధానకార్యదర్శి మారుపాక అనిల్ కుమార్,సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ముఖ్యఅతిథిగా హాజరైన్నారు.అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ,దళితుల భద్రతలు, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, వారి జనాభాకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు,ప్రమోషన్లలో రిజర్వేషన్లు,అంటరానితనానికి వ్యతిరేకంగా, దళితులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను ఏర్పాటు చేయడమే లక్ష్యం కోసం దీర్ఘకాలిక ఉద్యమాల ద్వారా మాత్రమే సాధించుకోగలుగు తామని అన్నారు.ప్రభుత్వం ప్రైవేటీకరణను నిలిపివేయాలని,ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని,సామాజికంగా గుర్తింపు లేని దళితులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించడమే సబ్ప్లాన్ ఉద్దేశమన్నారు. కులాంతర వివాహాలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని వారి డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రవి,సంధుల నరసన్న,సవలపెల్లి మల్లేశం,బాబు,కమలాకరు, శ్రీనివాస్, నాగరాజు,లక్ష్మణ్ లు పాల్గొన్నారు.

# నీటి సరఫరాకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వెంటనే చేయాలి

**సూర్య-కోరుట్ల**



పట్టణంలోని మిషిన్ భగీరథ ద్వారా వచ్చే నీళ్లు గత వారం రోజులుగా రాకపోవడం వల్ల పట్టణ ప్రజలందరికీ తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయనీ పట్టణ ప్రజలని పట్టించుకోని నాధుడే కరువయ్యారని,ప్రత్యమ్నాయ ఏర్పాట్ల లో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పెండెం గణేష్ అన్నారు. గురువారం ఢిల్లీ పర్యటనలో ఉన్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు సోషల్ మీడియా ద్వారా ఆయన విన్నవించారు.ప్రతిరోజు దిన చర్యలో భాగమైన నీళ్లు అందకపోవడంతో ఇంటి అవసరాలు తీర్చుకోవడం ఇబ్బందికరంగా మారింది. గత వారం రోజులుగా మిషన్ భగీరథ పైప్ లైన్లు మరమ్మత్తుల కారణంగా మున్సిపల్ నుండి రెండే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు, కానీ ఈ రెండు ట్యాంకర్ల ద్వారానే ప్రజలకు అవసరమయ్యే నీటి ఎద్దడిని తీర్చడం ఇబ్బంది కరం. పట్టణంలోని జనాభాని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చడానికి కోరుట్ల పూలు వాగులోని పంపు హౌస్ ద్వారా మిషన్ భగీరథ పైపు లైన్లకి లింకు కలిపి నీటి సరఫరా చేయడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.

# బీసీల సమస్యలు పరిష్కరించాలి

**సూర్య కొత్తపల్లి**

తెలంగాణ రాష్ట్రంలో జనాభా ఆధారంగా బీసీ రిజర్వేషన్‌లు అధికంగా ఇవ్వాలి అని బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో పెద్ద ఎత్తున యువత పోటీ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు బోయిని వేణు యాదవ్, గణేష్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతుల బిల్లులు చెల్లించాలి

**- విజయ డైరీ ఎండికి పాడి రైతుల వేడుకోలు**

**సూర్య, ఇల్లంతకుంట**

విజయడైరీ ఉత్పత్తిదారుల పాడి రైతులకు ఫెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి ఆదుకోవాలని పాడి రైతులు కోరుతూ గురువారం పత్రిక ప్రకటనలో వేడుకున్నారు. పాడి ఉత్పత్తిదారులకు 2024 సంవత్సరము నుండి పాల బిల్లులను సరిగా చెల్లించడం లేదని,నాటి నుండి నేటికీ కూడా మూడు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని,సెప్టెంబర్, నవంబర్ నెలల బిల్లులు, 2025 జనవరి మాసం బిల్లు కూడా పెండింగ్ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విజయ డైరీ రూ.50 వేల కోట్లను విడుదల చేసినట్లు పత్రికలో ప్రకటనలు చేసిందే తప్ప నేటికీ బిల్లులు అందించిన దాఖలాలు లేవన్నారు. అదే విధంగా రూ. 4ల బోనస్ జమ చేసి ఇస్తామని చెల్లిస్తామని ప్రకటనలు వచ్చాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.ఇప్పటికైన పాడి రైతుల యొక్క బాధలు అర్థం చేసుకొని సకాలంలో వారి బిల్లుల డబ్బులు చెల్లించాలని కోరారు.సకాలంలో చెల్లించని యెడల ప్రైవేట్ డైరీలకు వెళ్లే అవకాశాలు లేకపోలేదాన్నారు.

# క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

**సూర్య కోరుట్ల**




కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయంలో కార్మికులకు క్షయ వ్యాధి నిర్ధారణ పరిక్షలు టిబి సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి నీలారపు శ్రీనివాస్ పాల్గొని అతివేగంగా వ్యాపించే వ్యాధుల్లో క్షయ వ్యాధికూడా ప్రదకరమైనది.ఈ వ్యాధి సోకిన వారికి ఆకలి లేకపోవడం, 2వారాలకు మించి దగ్గు ఉండటం, బరువు తగ్గడం ముక్య లక్షణాలు అని,ఇట్టి క్షయ వ్యాధి ప్రభుత్వ ఆరోగ్యకేందాల్లో ఉచిత పరీక్షలు,ఉచితముగా మందులు అందజేయబడుతాయని తెలిపారు.ఈ వ్యాధి సోకినవారు తగిన చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతారని అన్నారు. కోరుట్ల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఏరియా హాస్పిటల్ సూపరెండేంట్ సునిత రాని,వైద్యులు వినోద్,శృతిలయ,శివాని జిల్లా పీపీఎం కట్ట హరీష్, టిబి సూపర్ వైసర్‌లు ఇమ్రాన్, మల్లికార్జున్, రియాజ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

# కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**సూర్య వేములవాడ**



వరంగల్ జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది గంధం శివపై పోలీసులు దాడి చేసిన ఘటనపై తెలంగాణ న్యాయవాదుల ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం వేములవాడలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం మాట్లాడుతూ పోలీసులు ఈ మధ్యకాలంలో న్యాయవాదులపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం పరిపాటిగా మారిపోయిందని, న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై తక్షణమే కేసు నమోదు చేయాలని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవధూత రజినీకాంత్, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, రేగుల దేవేందర్, విద్యాసాగర్ రావు, వేముల సుధాకర్ రెడ్డి, పొత్తూరు అనిల్ కుమార్, పెంట రాజ్ కుమార్, నక్క దివాకర్, గౌంటి శంకర్, పిల్లి మధు, జెట్టి శేఖర్, బొజ్జ మహేందర్, నర్సింగరావు, భీమా మహేష్, గుజ్జే మనోహర్, గుండా రవి, మాదాసు దేవయ్య, మల్లేష్, అనిల్, హన్మంత్ రెడ్డి, జనార్దన్, మహిళా న్యాయవాదులు సరిత, మమతా, నయమా నాసారి పాల్గొన్నారు.

# బస్సును వెనుక నుండి ఢీకొన్న లారీ

**- తృటిలో తప్పిన ప్రమాదం**

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ నుండి జమ్మికుంట కు వెళ్తున్న ఆర్టీసీ బస్సులు గురువారం వెనుక నుండి వస్తున్న లారీ ఢీకొట్టడంతో బస్సు డివైడర్ ను ఢీకొంది. పోలీసుల కథనం ప్రకారం... హుజురాబాద్ నుండి జమ్మికుంటకు మినీ ఆర్టీసీ బస్సు 40 మంది ప్రయాణికులతో జమ్మికుంటకు వెళ్తుండగా సాయి రూప ఫంక్షన్ హాల్ వద్ద వెనక నుండి వేగంగా వస్తున్న లారీ బస్సును ఓవర్టేక్ చేయబోయి ఢీకొంది. ఈ సంఘటనలో ఆర్టీసీ బస్సు పక్కనే ఉన్న డివైడర్ ను ఢీ కొట్టింది. కాగా బస్సులో ఉన్న 40 మందికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ సంఘటనలో బస్సు ముందు భాగం దెబ్బతింది. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు లారీ డ్రైవర్ ఎండి. జలీల్ పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి

## - కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

రాబోయే వేసవి కాలంలో త్రాగునీటి ఎద్దడి లేకుండా చూసేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.గురువారం త్రాగు నీటి సరఫరా పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా త్రాగు నీటి సరఫరా లో భాగంగా చేపట్టిన పనులు, ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతున్న ఆవాసాలు, వాటర్ సోర్స్, ఇబ్బందులు తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రాబోయే వేసవి కాలంలో నీటి సరఫరా సమస్యలు ఎక్కడ ఉత్పన్నమవుతాయి,



వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల పై నివేదిక ముందుగానే అందించాలని కలెక్టర్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఇంట్రాలో లీకేజీ, మరమ్మత్తు వంటి పనులు ఏవైనా ఉంటే వెంటనే చేపట్టాలని అన్నారు. జిల్లాలో ఏదైనా ఆవాసాలకు గ్రిడ్ వాటర్ అందడం లేదా వంటి వివరాలను మండలాల వారీగా కలెక్టర్ తెలుసుకున్నారు. త్రాగు నీటి సరఫరా సంబంధించి లీకేజిలు, పంప్ మరమ్మత్తు ఏవైనా ఉంటే వెంటనే పూర్తి చేయాలని అన్నారు.మిషన్ భగీరథ నిర్వహణకు సంబంధించి ఏవైనా పనులు చేపట్టాల్సి ఉంటే వెంటనే ప్రతిపాదించి ఈనెల 12 తారీఖు లోపు అందజేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో ఈ ఈ ఇంట్రా గంగాధర శ్రీనివాస్, ఈ ఈ గ్రిడ్ పూర్ణచందర్ , డి. ఈ లు , ఏ. ఈ .లు ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తోనే పట్టభద్రుల సమస్యలు పరిష్కారం

## - ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

**సూర్య సిరిసిల్ల టౌన్**

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఉట్కూరి నరేందర్ రెడ్డి గురువారం సిరిసిల్లాలో తన ప్రచారాన్ని చేపట్టారు.పలు ప్రాంతాలలో వాకింగ్ చేస్తున్న వాకర్స్ తో నరేందర్ రెడ్డి ముఖాముఖి ముచ్చటించారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కరీంనగర్, మెదక్,అదిలాబాద్,నిజామాబాద్ పట్ట బద్రుల నియోజకవర్గ శాసనమండలికి పోటీ చేస్తున్న ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఉట్కూరి నరేందర్ రెడ్డి వాకర్స్ తో ముఖాముఖి చర్చించారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం,బతుకమ్మ ఘాట్,కార్గిల్ లేక్,ఇంద్ర పార్క్, రాజీవ్ నగర్ స్టేడియం వంటి ప్రాంతాల్లో విస్తృతంగా వారు పర్యటించి పట్టభద్రులైన వాకర్స్ తో ముచ్చ టిస్తూ మీరే నా బలం గళం మీ సంక్షేమ ధ్యేయంగా శాసనమండలికి తనను పంపించాలని కోరారు.



ఫిబ్రవరి 27న జరిగే పట్ట బద్రుల శాసన మండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేస్తున్నాను కావున మీమద్దతు తెలిపి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి బహుమానంగా ఇవ్వాల్సిందిగా పట్టబద్ధులను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా వీఎన్నార్ టీం ఇంచార్జ్ మాసం రత్నాకర్ పటేల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం నర్సయ్య, సంగీతం శ్రీనివాస్,గోలి వెంకటరమణ, వేల్పుల తిరుపతిరెడ్డి, విఎన్ఆర్ టీం సభ్యులు అల్లాడి చంద్రశేఖర్ ఆనందం, కనపర్తి జగదీశ్వర్, తోపుల శ్రీనివాస్,సుద్దాల శ్రీనివాస్ ,రాజు, మల్లేశం, మడుపు ప్రవీణ్ రెడ్డి,యేసు రత్నం,గోనె ఎల్లప్ప, కల్లూరు చందన తదితర నాయకులు పాల్గొన్నారు.



# లక్షలాదిగా తరలి రండి.. మీ వాడిగా ఆశీర్వదించండి..

## - డాక్టర్ ప్రసన్న హరికృష్ణ - నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

మేధావులు మౌనం వీడాల్సిన సమయం ఇది. ప్రశ్నించే గొంతుకగా, సమస్యలను పరిష్కరింప చేసే సత్తా ఉన్నవాడిగా శుక్రవారం కరీంనగర్ నిజమాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నాను.నాకు అండగా నిలిచి మద్దతుగా లక్షలాదిగా తరలి వచ్చి ఆశీర్వదించండనీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ నా 19 సంవత్సరాల ప్రభుత్వ ఉద్యోగ జీవితానికి రాజీనామా చేసి నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యలకు ప్రశ్నించే గొంతుకగా సమస్యలను పరిష్కరింప చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చాను.ఇప్పటి వరకు మీరందరు అండగా నిలిచి ఆశీర్వదించారు. ఈ నెల 7వ తేది శుక్రవారం రోజున మధ్యాహ్నం 12 గంటలకు నామినేషన్ వేస్తున్నాను. మీరందరు నా వెంట తరలి వచ్చి నాకు అండగా నిలిచి మీ బిడ్డగా, మీ వాడిగా, మీ కుటుంబ సభ్యుడిగా ఆదరించి ఆశీర్వదించగలరని కోరారు.నా నామినేషన్ ప్రక్రియ కరీంనగర్ ఎస్సారార్ కాలేజీ నుండి



లక్షాలాధిగా తరలివచ్చిన మీఅందిరితో కలిసి కోర్టు సర్కిల్, ఆర్ అండ్ బి గెస్ట్‌హౌజ్, తెలంగాణ చౌక్ నుండి ప్రతిమ మల్టీప్లెక్ మీదుగా కరీంనగర్ కలెక్టరేట్‌లో పట్టభద్రుల సాక్షిగా నామినేషన్ వేస్తున్నాను. భ్రష్టుపట్టిన ప్రస్తుత రాజకీయాలను ప్రక్షాళన చేయడానికి మీరు నాకు అండగా ఉన్నరనే ధైర్యంతో ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి అడుగుపెట్టిన నన్ను వెంట ఉండి ముందుకు నడిపించాలని కోరారు.

# శ్రీ దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న జబర్దస్త్ నటులు..

**. సూర్య బోయినపల్లి..**

మండలంలోని వరద వెళ్లి గ్రామంలో గుట్టపై వెలిసిన శ్రీ దత్తాత్రేయ స్వామిని గురువారం రోజు జబర్దస్త్ నటులు సుడిగాలి సుదీర్, రాంప్రసాద్ దర్శించుకున్నారు. వారు మాట్లాడుతూ ఈరోజు దత్తాత్రేయ స్వామి ని దర్శించుకోవడం మా అదృష్టంగా భావిస్తూన్నం అని స్వామివారి కృప అందరిపై ఉండాలని కోరుకున్నారు. గుట్ట పైన ఎంతో ప్రకృతి అందాలతో బోటు ద్వారా వచ్చి దత్తాత్రేయుని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ, నాగుల సాంబయ్య, భక్తులు పాల్గొన్నారు.





# 'ఖని'లో రూ.3 కోట్లతో ఉడాయించిన నగల వ్యాపారి.!?

**సూర్య-గోదావరిఖని:**

ఇక్కడి లక్ష్మీనగర్‌లోని శ్రీనాథ్ జ్యువెలర్స్ కు చెందిన తానాజీ జాదవ్ అనే నగల వ్యాపారి గత వారం రోజులుగా కనిపించకుండా పోవడం, అతని జ్యువెలర్స్ షాపు బోర్డును తొలగించడంతో ఒక్కసారిగా బాధితులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే దాదాపు 35 ఏళ్ల క్రితం మహారాష్ట్ర నుండి కట్టుబట్టలతో ఇక్కడికి వచ్చిన తానాజీ జాదవ్ రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ప్రజలతో మంచి సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని నగల వ్యాపారిగా మారాడు. గత కొంతకాలంగా కుటుంబంలో ఏర్పడిన కొన్ని కలహాలు, ఆర్థికపరమైన ఇబ్బందుల నేపథ్యంలో తానాజీ తనకు ఉన్న ఆస్తులను అమ్మి దాదాపుగా అప్పులు కట్టినట్లు తెలుస్తుంది. ఇంకా కొన్ని అప్పులు అలాగే ఉన్నప్పటికీ వారం రోజులుగా కనిపించకుండా పోవడంతో ఒక్కసారిగా బాధితులు అతని జ్యువెలర్స్ ఎదుట ఆందోళనకు దిగారు. ఒక్కొక్కరు రూ.2 లక్షల రూపాయల నుండి రూ.5 లక్షల రూపాయల వరకు తమకు వచ్చేది ఉంది అంటూ చెప్పడం కనిపించింది. గతంలో కూడా తానాజీ వారం పది రోజుల పాటు కనిపించకుండా పోవడం లాంటివి జరిగినప్పటికీ తిరిగి మళ్లీ వచ్చి యధావిధిగా తన వ్యాపార లావాదేవీలను కొనసాగించినట్లు స్థానిక బులియన్ వ్యాపారస్తులు చెబుతు న్నారు. తానాజీ కి స్థానికంగా కొన్ని ఆస్తులు ఉన్నాయని, మళ్లీ తిరిగి వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని చెబుతుండడం కొసమెరుపు. ఇదిలా ఉండగా దాదాపు రూ.3 కోట్ల వరకు అప్పు చేసి పరారైనట్లు స్థానికంగా ఆరోపణలు వెలబడుతున్నాయి. బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుండడంతో వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

# వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో శ్రీ షిరిడి సాయి భక్త భజన మండలి వారి భజన

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కలియుగ ప్రత్యక్ష దైవం, మార్కెట్ రోడ్ లో వెలసిన స్వయంభు శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రోజు న 9 గంటల 30 నిమిషాల నుండి 11 గంటల వరకు శ్రీ షిరిడి సాయి భక్త భజన మండలి ఆదర్శనగర్ కరీంనగర్ వారి 919 వ సత్సంగము భజన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో క్రమశిక్షణతో నిర్వహించబడింది. సమస్త దేవత ప్రార్థన అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం సామూహి కంగా నిర్వహించబడింది. శ్రీ శిరిడి సాయి భక్త భజన మండలి గౌరవ అధ్యక్షులు, ఫౌండర్ నలమాచు చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతున్న బ్రహ్మోత్స వాల్లో మా భజన మండలిని ప్రతి సంవత్సరం ఆహ్వానించడం జరుగుతు ందని ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ పాలన అధికారులకు , మంత్రి పొన్నం ప్రభాకర్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మేమెంటో శేష వస్త్రం సర్టిఫికెట్లను సాంస్కృతిక శాఖ ఇంచార్జ్ గోగుల ప్రసాద్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ మరియు గౌరవ అధ్యక్షులు నలమాచు చంద్రశేఖర్-రాణి దంపతులు, గురుజి నర్సింగరావు , డోలక్ శ్రీరాముల రాము, దండే రాజశేఖర్ ,చిట్టి మల్ల కొండయ్య స్వర్ణలత దంపతులు, రాచమడుగు వేణు మహేశ్వరరావు వనజ దంపతులు, మద్దెల అంజన్న, సింహాచలం దయాసాగర్, రామిడి శ్రీధర్ ఏవి మల్లికార్జున్, నునుగొండ శ్రీనివాస్ , హరిణి,సాయి కృష్ణ ఆర్ ఎస్ పి రెడ్డి, నీలగిరి అనిత, పద్మా రెడ్డి,లక్కాకుల శ్రీదేవి, భారతి, సురేష్, తేజస్విని, కవిత, రమాదేవి, రాచమల్ల రంజిత్, చింతకింది వేణుగోపాల్, పాత విశ్వనాథం, వెలిచాల చంద్రమోహన్, తొడుపునూరి తిరుపతి, దాదాపు 30 మంది పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

**సూర్య -కోరుట్ల**

రాష్ట్రాములో బీసీ కులగణన విజయవంతమైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్రా ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల,చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూఆనాడు భారత జోడో యాత్ర సందర్భమ్మంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కులగనన చేస్తామని హామీఇచ్చారు. రాష్ట్రామ్‌లో అధికార ంలోకి కాంగ్రెస్ పార్టీ రాగానే, కులగనన సర్వే చేసి, విజయవంతగా కులగణన పూర్తిచేసి ఆమోదించిన రాష్ట్రా ప్రభుత్వానికి, హామీ నెరవేర్చిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి,ఇతర మంత్రులకు, రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్ కి కృతజ్ఞతలు చెప్పి వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణన ద్వారా ఓబీసీ లు అందరికీ రిజర్వేషన్లు పెరిగి సామాజిక, విద్య,ఉపాధి,



రాజకీయ అవసరాలు మెరుగుపడతాయని అన్నారు. ఇది దేశంలో చారిత్రాతకమైన నిర్ణయం అని అన్నారు. దేశం మొత్తము తెలంగాణ రాష్ట్రం వైపు చూస్తున్నదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆశాజ్యోతి అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ కి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి, సబ్ కమిటీ చెర్మన్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్ కి, రాష్ట్ర ఓబీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి శ్రీకాంత్, ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డి ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి జువ్వడి నర్సింగ్ రావు , సీనియర్ కాంగ్రెస్ నాయకులు కృష్ణారావుకుకృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్ గౌడ్, కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతరాజం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, కోరుట్ల మండల బీసీ సెల్ అధ్యక్షుడు ముక్కెర లింబాద్రి,మల్లాపూర్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు సురేష్, జిల్లా కిషన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోతుగంటి శంకర్ గౌడ్, నాయకులు పుప్పాల ప్రభాకర్, ఎంభేరి నాఘభూషణం, సింగల్ విండో చైర్మన్ ఏలుశెట్టి భూమా రెడ్డి, మోర్తాద్ లక్ష్మి నారాయణ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేష్, మేకల నర్సయ్య, ఎంభేరి సత్యనారాయణ,నేమురు భూమయ్య, చిట్యాల లక్ష్మి నారాయణ, తెడ్డు విజయ్, శ్రీరాముల అమరేందర్ బొట్టు నరేష్,నామాబాత్ రాకేష్,రిజ్వాన్, రియాజ్,సరికేల్ల నరేష్,మంతెన గంగ నరసయ్య, జనిల్, జక్కుల రాజాం,గుగ్గిళ్ల సురేష్ కల్లూరి దేవయ్య,సంఘాని శంకర్, కుమ్మరి శంకర్, ,పసుల కృష్ణ ప్రసాద్, సరికెళ్ళ మల్లారెడ్డి, విట్టల రవీందర్ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

# బీసీ జనాభా తగ్గించడంలో మతలబు ఏమిటి..?

## - కులగణన సరైన రీతిలో జరగలేదు

## - జక్కని సంజయ్ కుమార్

**సూర్య, హుజురాబాద్**

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగనణ సక్రమమైన రీతిలో జరగలేదని, ఓసీల జనాభా పెరిగి బీసీల జనాభా తగ్గడంలో మతలవేమి టని...? బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ తప్పులతడకగా ఉన్న కులగణన సరియైనదా....? కాదా...? అనే అనుమానాలు ప్రజలకు కలుగుతున్నాయని అన్నారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించిన సమగ్ర సర్వే లో ఉన్న లెక్కలకు ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన కుల గణనకు ఎంతో తేడా ఉందని అన్నారు. ఏడాదికి ఏడాది జనాభా పెరుగుతుంది తప్ప ఎక్కడ తగ్గదని, కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం చేయించిన సర్వేలో మాత్రం బీసీల జనాభా, ఎస్సీల జనాభా తగ్గినట్లు చూపడం సహేతుకం కాదని, వాస్తవానికి దూరంగా ఉందని అన్నారు. బీసీలు ఎందరున్నా ఎలక్షన్ మానిఫెస్టోలో కేవలం 42 శాతం మాత్రమే రిజర్వేషన్ ను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని అన్నారు. కానీ జనాభా ఎక్కువ ఉన్నప్పుడు 42 శాతం ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రజల్లో కుల గణనపై ప్రభుత్వం చెప్పే లెక్కలపై పూర్తి అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయడం వారి కనీస ధర్మం అని అన్నారు. బీసీలకు అన్యాయం జరిగితే బీసీలు సహించారని, ఒక్కటై ఉద్యమం చేస్తారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవాలు ప్రజలకు చెప్పడానికి ప్రయత్నించి జరిగిన తప్పులను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ ఆజాది నాయకులు చిలకమారి శ్రీనివాస్, ఇప్పకాయల సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# మృతిని కుటుంబానికి 30వేల ఆర్థిక సహాయం

## - బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పిన సంఘం సభ్యులు

**సూర్య చిగురుమామిడి**



చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బోయిని పరశురాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మాదిగ కులం సంగం తరపున పరామర్శించి 30వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సంఘం తరపున అందజేశారు.ఈ సందర్భంగా బోయిని పరశురాములు భార్య పద్మకు 30వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు కుల సంఘాల సభ్యులు తెలిపారు.కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించారు.మృతిని కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని కుల పెద్దలు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బోయిని ఆది మల్లయ్య, బోయిని సదయ్య, బోయిని వేణుగోపాల్,బోయిని మల్లయ్య, బోయిని రామయ్య, బోయిని వెంకటయ్య, బోయిని కొమురయ్య, బోయిని రాజయ్య, బోయిని రామ్ లక్ష్మణ్, కాశిపాక సంపత్, బోయిని శ్రీనివాస్, బోయిని రవి, బోయిని ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లు అశ్లీల చిత్రాలను చూస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

## - మైనర్ పిల్లల ఫోర్న్ చిత్రాలు చూసిన ఇద్దరు వ్యక్తుల రిమాండ్

## - ఎల్లారెడ్డిపేట సిఐ శ్రీనివాస్ గౌడ్

**సూర్య గంభీరావుపేట**



గంభీరావుపేట మండలం నర్మాల, మల్లారెడ్డిపేట గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు మైనర్ పిల్లల పోర్న్ వీడియోలు చూడడమే కాకుండా వాటిని ఇంస్టాగ్రామ్, తదితర ఆప్ లలో డౌన్లోడ్ చేయడం తో ఆదునాతన టెక్నాలజీతో అట్టి వ్యక్తులను గుర్తించి వారిపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్ కు తరలించామని ఎల్లారెడ్డిపేట సిఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు పోర్న్ వీడియోలు నీలి చిత్రాలు చూసిన డౌన్లోడ్ చేసిన ముఖ్యంగా చిన్నపిల్లల పోర్న్ వీడియోలు చూసిన డౌన్లోడ్ చేసిన అధునాతన టెక్నాలజీతో వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా కఠిన కఠినంగా శిక్షించడం జరుగుతుందని ముఖ్యంగా యువత ఇలాంటి పోర్న్ వీడియోలు,అశ్లీల చిత్రాలు చూడకుండా ఉండాలన్నారు. ఎవరు చూడడం లేదని అనుకుంటే పొరపాటేనని చిత్రాలు వారిని అధునాతన టెక్నాల తో సైబర్ టీం ఎల్లవేళలా గమనిస్తుంటుందని తెలిపారు. చిన్నపిల్లలు ముఖ్యంగా మైనర్లు ఇలాంటి వాటికి దూరంగా ఉండి మంచి నడవకలతో సన్మార్గంలో నడుస్తూ విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగేలా నడుచుకోవాలని సూచించారు. ఆయన వెంట గంభరావుపేట ఎస్సై ఎల్ శ్రీకాంత్ సిబ్బంది ఉన్నారు.

# నేత్రదాత సంస్మరణ సభ

**సూర్య, వీణవంక**



నేత్రదాత అయిత సత్యనారాయణ సంస్మరణ సభను వీణవంకలోని వారి నివాసంలో సదాశయ ఫౌండే షన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు యం. నరహరి ఆధ్వర్యంలో నిర్వహించగా అతిథులుగా సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రావణ్ కుమార్, జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారిలు పాల్గొని వచ్చిన బంధు మిత్రులకు నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పిం చారు. అలాగే నేత్రదాత కుమారుడు, కోడలు అయిత శివ శంకర్, రజిత, కూతురు, అల్లుడు బెజగం ప్రగతి, మధు లకు సదాశయ ఫౌండేషన్ జ్ఞాపిక అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జమ్మికుంట కన్వీనర్ గర్రెపల్లి వెంకటేశ్వర్లు (డీలర్), వీణవంక డీలర్ శ్రీధర్, ఓదెల కార్యదర్శి క్యాతం మల్లేశంలు పాల్గొని నేత్రదాతకు నివాళులు అర్పించి కుటుంబానికి అభినందనలు తెలిపారు. వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవ, శరీర, నేత్ర దానాలపై అవగాహన సదస్సును ఇంచార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. ఈ దానాల ఆవశ్యకతను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రావణ్ కుమార్, జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు యం. నరహరి, ఓదెల కార్యదర్శి క్యాతం మల్లేశం వివరించారు. ఈ సందర్భంగా రాంమోహన్ మాట్లాడుతూ అవయవ, శరీర దానాలపై ఎంతో విలువైన సమాచారం విద్యార్థులకు అందజేసిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ పాల్గొన్నారు.

# సైన్స్ మన జీవితాలను మారుస్తుంది

**సూర్య, హుజురాబాద్**



విద్యార్థులు చదువుకునే సమయంలో సైన్స్ పట్ల అవగాహన పెంచుకో వాలని, అది జీవితాలను మారుస్తుందని పలువురు వక్తలు అన్నారు. గురువారం హుజురాబాద్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న జ్ఞానాన్ని వెలికి తీయుటకు టాలెంట్ టెస్టులు ఉపయోగపడతాయని అన్నారు. గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ జగదీశ్వర్ విద్యారంగానికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పిల్లలకు పరీక్షలు పెట్టి వారిలో నిబిడీకృతంగా ఉన్న విజ్ఞానాన్ని పైకి తీస్తున్నారని అన్నారు. ఇంతే కాకుండా వారికి ప్యాడులు, పెన్నులు, ఇతర సామాగ్రిని ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ జగదీశ్వర్, ప్రిన్సిపాల్ ఆఖ్యారపు రాణి, కే. అశ్వద్, ఎం. అరవింద్, ఏ. సిద్ధార్థ, జి. వినాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కళాకారులకు ఘన సన్మానం

**సూర్య, హుజురాబాద్**

ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకల్లో భూపాల్ లో జరిగిన వేడుకల్లో పాల్గొని పేరు సాధించిన హుజురాబాద్ ప్రాంతానికి చెందిన కళాకారులను గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ప్రాంత ఖ్యాతిని దేశవ్యాప్తం చేశారని అభినందించారు. గ్రామీణ కళలకు బహుళ పేరు వచ్చే విధంగా కృషి చేసిన కళాకారులందరి కృషి గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, ఉమ్మడి జిల్లా ఇంచార్జీ రుద్రారపు రామచంద్రం, రాష్ట్ర నాయకులు మారేపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు తునికి వసంత్, జిల్లా అధికార ప్రతినిధి తుంగ ఆంజనేయులు, ఇమ్మడి శ్రీధర్, సాంస్కృతిక కళాకారుల సమైక్య జిల్లా అధ్యక్షులు వైయస్ శర్మ, కళాకారులు అందాసి నారాయణ, కళాబృందం, ఎండి. రఫీ, మొలుగూరి ప్రభాకర్, మాడుగుల ఓదెలు, తునికి సమ్మయ్య, రుద్రారపు రవితేజ, కోడూరి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికి మాత్రలు అందించాలి

## - డాక్టర్ మధు

**సూర్య, హుజురాబాద్**



జాతీయ నులి పురుగు దినోత్సవంను పురస్కరించుకొని ఈనెల 10న హుజురాబాద్ మండలంలోని పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికి ఆల్బెండజోల్ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని చెల్పూర్ పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ మధు అన్నారు. గురువారం హుజురాబాద్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అంగన్వాడీ టీచర్లకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10న పిల్లలందరికీ నులి పురుగు నివారణ కోసం వారు చదువుకునే పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ జరుగుతుందని, వాటిని వారు వేసుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ నెల 10న మాత్రలు వేసుకొని పిల్లలు ఎవరైనా ఉంటే 17న తిరిగి వారికి వేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఎంఈఓ భూపతి శ్రీనివాస్, హెచ్ఈఓ విజేందర్ రెడ్డి, సూపర్ వైజర్ రవి, హెల్త్ అసిస్టెంట్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

# జల్సాలు, వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలు

**సూర్య-గోదావరిఖని:**

జల్సాలు, వ్యసనాలకు అలవాటు పడి డబ్బు కోసం దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తి చివరకు పోలీసులకు చిక్కాడు. వివరాల్లోకి వెళితే పట్టణంలో గత కొంతకాలంగా తాళాలు వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేస్తూ వరస దొంగతనాలకు పాల్పడుతున్న ఐత వెంకటేష్ అనే వ్యక్తిని ఏట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో నిందితుడి వివరాలను ఖని ఏసిపి మడత రమేష్ తెలిపారు. గోదావరిఖని పట్టణం రమేష్ నగర్ కు చెందిన ఐత వెంకటేష్ అనే నేరస్తుడు గత కొంతకాలంగా పట్టణంలో తాళం వేసి ఉన్న ఇండ్లను మధ్యాహ్నం సమయంలో తెలుసుకొని, రాత్రి



సమయాల్లో ఆ ఇళ్లలోకి చొరబడి దొంగతనాలు చేయడం మొదలుపెట్టినట్లు తెలిపారు. దొంగిలించిన సొమ్మును సరదాల కోసం విచ్చలవిడిగా ఖర్చు పెడుతూ హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ ప్రాంతాల్లో తిరుగుతూ డబ్బులను విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ జల్సాలకు బానిస అయినట్లు తమ విచారణలో వెలుడైనట్లు తెలిపారు. వరుసగా జరుగుతున్న దొంగతనాల పై ప్రత్యేక స్పెషల్ పార్టీ టీంను ఏర్పాటు చేసి అధునాతన టెక్నాలజీ సహాయంతో నిందితుని పట్టుకున్నట్లు చెప్పారు. వెంకటేష్ 11 దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, నిందితుడి నుంచి రెడ్ కలర్ శాంత్రో కార్, రెండు మొబైల్ ఫోన్లు, రూ.20,000 నగదు, 4.130 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి రమేష్ తెలిపారు. వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితున్ని పట్టుకున్న గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఏ.ఇంద్రసేనారెడ్డి, అదనపు సీఐ రవీందర్, క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుల్ నీలిగొండ రమేష్ అలియాస్ కాటారం రమేష్, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు తీట్ల శ్రీనివాస్, గోపతి వెంకటేష్, రమేష్, మధుసూదన్ ను ఏసీపీ అభినందించి నగదు రివార్డును అందజేశారు.

# ఏడాది కాంగ్రెస్ పాలన

**- ఎదురుచూపుల పాలనే. - యూరియా కోసం రైతుల పాడిగాపులే నిదర్శనం**

**- బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కో కన్వీనర్. మీసరగండ్ల అనీల్ కుమార్**

**సూర్య. ఇల్లంతకుంట.**

ఏడాది కాంగ్రెస్ పాలన అంటేనే కళ్ళు కాయలు కాసే ఎదురు చూపులైన నమ్మకంలేని పాలనే అని బి ఆర్ ఎస్ పార్టీ సోషల్ మీడియా కో కన్వీనర్ మీసరగండ్ల అనీల్ కుమార్ పేర్కొన్నారు.గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రజా పాలన అంటూనే ప్రజలకు, రైతులకు కావాల్సిన వసతులు, ఎరువులు, యూరియా కొరతవల్ల రైతులు దుకాణాల ఎదుట బారులు తీరి పాడిగాపులు కాస్తున్న ప్రభుత్వ తీరుకు నిదర్శనమే అన్నారు.భూమిని నమ్ముకుని ప్రపంచానికి బువ్వను అందించే రైతన్నలు నేడు పిడికిలెత్తి నిరసనలు తెలిపే రోజులు వస్తున్నాయని,.పదేళ్ల కేసీఆర్ పాలనల గుండెల నిండా ఆత్మవిశ్వాసంతో వ్యవసాయం చేసిన రైతన్నలు నేడు ఏడాది కాంగ్రెస్ పాలనలో గుండె దిగులుతో కాలం వెల్లదీస్తున్నరన్నారు. దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో దగాపడ్డ రైతన్నలు పదేళ్ల కేసీఆర్ పాలనలో వెలుగులతో వుండి ఏడాది కాంగ్రెస్ పాలనలో మటుమాయం అవుతున్నాయన్నారు. రైతుభరోసా,రైతుబీమా, రుణమాఫీ, కోసంఎదురుచూపులు,యూరియాల కోసం ఎదురుచూపులు సాగునీటి కోసంబి బిఎదురుచూపులేనని ఏడాది కాంగ్రెస్ పాలన ఎదురుచూపుల పాలన గా మారిందని, బికపట కాంగ్రెస్ పాలనలో రోడ్లపైకి వచ్చే పరిస్థితి నెలకొందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో యూరియా కొరతతో రైతులు కలత చెందుతు న్నారు.కాంగ్రెస్ అధికారం లోకి రాగానే రైతు భరోసా ద్వారా రూ.15,000 వేస్తానని, రూ.12 000 లు వేస్తా నని చెబుతూ మాట మార్చుతూ నేటికీ భరోసా వేయకపోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నాడని విమర్శలు చేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు 15 నామినేషన్లు

**- గ్రాడ్యుయేట్ స్థానానికి 12,ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 3**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

మెదక్ నిజామాబాద్ కరీంనగర్ ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 12 మంది నామినేషన్ వేయగా టీచర్స్ ఎమ్మెల్సీకి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థుల నుండి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నామినేషన్లు స్వీకరించారు.తేది 06.02.2025 నాటికి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు కలిపి మొత్తం 28 మంది నామినేషన్ దాఖలు చేశారు. ఇందులో 21 మంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి, ఏడుగురు టీచర్స్ ఎమ్మెల్సీకి నామినేషన్ వేశారు.

## రెండవ రోజు కొనసాగిన రైతుల రిలే నిరాహార దీక్షలు

**సూర్య చిగురుమామిడి**

మండలంలోని సుందరగిరి గ్రామం లో డి ఫోర్ కెనాల్ కాలువతో రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని, వెంటనే ఆ కెనాల్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండవ రోజు కొనసాగాయి.రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్న తరుణములో రైతులు ఎల్ 21మైనర్ ధ్వారా ఎలాంటి ఉపయోగం లేదని అధికారుల దృష్టికి ఈ ఎల్ 21కాల్వా కింద భూమి పోతున్న 31మంది రైతుల ఆరోగసను అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. అధికారులను వివరణ కోరగా. సుందరగిరిలో %ూ% 21మైనర్ కాలువ ధ్వారా రైతులకు దాధాపు 200ఎకరాల వ్యవసాయ భూమి ఆయకట్టు ప్రాంతాము నీటి పారదల కొరకు ఈ %ూ% 21మైనర్ కాలువ ఉపయోగం ఉంటదని,ఈ కాలువ నుండి చెరువులో నీటిని నింపడం కొరకు కాదని కేవలము ఈ రైతుల వ్యవసాయ భూములు నీటిపారుదల గురించని తెలిపారు.

## బిజెపి మైనార్టీ మోర్చ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ,బండి సంజయ్ చిత్రపటాలకు పాలభిషేకం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బిజెపి మైనార్టీ మోర్చా జిల్లా శాఖ అధ్యక్షులు ఎండి . సమీపర్వేజ్ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ తెలంగాణ చౌక్ లో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు నిర్మల సీతారామన్, బండి సంజయ్ కుమార్ చిత్రపట ానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ మాట్లాడుతూకేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా ఉందని, వికసి త్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. రూ.12లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు గొప్ప శుభవార్త లాంటిదని, ముఖ్యంగా వేతన జీవులకు గొప్ప వరం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బలబీర్ సింగ్, పార్లమెంట్ ఇంచార్జ్ మహమ్మద్ బషీరుద్దీన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ తాజుద్దీన్, మొహమ్మద్ సిద్ధిక్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సైజాద్, మొహమ్మద్ సమీ, సాబీర్,ఫసి, సైద్, బిజెపి రూరల్ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు అఫ్రోజ్, రవీందర్ పాల్ సింగ్, రాజ్ పాల్ సింగ్, ఇందర్ జిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు..

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**సూర్య సిరిసిల్ల టౌన్**

ఆర్థిక ఇబ్బందులు,కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిరిసిల్లలో చోటుచేసుకుంది.సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విద్యానగర్ చెందిన మడుపు జయ కీర్తి రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరిపో సుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు దినసరి కూలిగా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొ స్తున్నాడు గత కొంతకాలంగా సరైన పని దొరకకపోవడంతో ఇంటి వద్ద ఉంటున్నాడు.పని లేక ఇంట్లో ఉండడంతో భార్యతో తరచూ గొడవలు జరిగేవనీ వారం రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన జయ కీర్తి రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.మృతుడికి భార్య శ్రావణి,కొడుకు మంజునాథ్ లు ఉన్నారు. సిరిసిల్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం నరసింహులపల్లి గ్రామానికి చెందిన జెసిపి ఆపరేటర్ అజయ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా జెసిపి ఆపరేటర్ యూనియన్ తరపున రూ. 15 వేల ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బేతి కర్ణాకర్, నరేష్, గొల్లపల్లి మహేష్, కేకేసి నాయకులు, మేక వెంకన్న పాల్గొన్నారు.



## దుర్షేడ్‌లో పోచమ్మ ప్రతిష్టాపన

**సూర్య కొత్తపల్లి....**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోగల దుర్షెడ్ డివిజన్ లో గురువారం రోజున బంగారు పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా వేదపండితులు శ్రీరాంభట్ల కార్తీక్ శర్మ బృందం దేవరాజ్, ప్రశాంత్ శర్మ, మధుసూదనాచార్యులు, ఆధ్వర్యంలో రెండవ రోజు ఉదయం హెూమము మరియు 108 కలశాలతో మహాస్నపనము, సాయంకాలం ధాన్యాదివాసము ఫలాదివాసము పుష్పాదివాసము మొదలగు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకలకు డివిజన్ కి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కోరుకంటి వేణుమాధవ రావు, సింగిల్ విండో చైర్మన్ తోట తిరుపతి,సింగిల్ విండో డైరెక్టర్ గాజుల అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్ రావు, మరియు నందల తిరుపతి,వేముల రామచంద్రం, మరియు పలు కుల సంఘాల సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్ కి తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న వై అశోక్ కుమార్ కి తెలంగాణ ఆల్ యూనివ ర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ గా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ గురువారం శాతవాహన విశ్వవిద్యాల యంలో జరిగిన సమావేశంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ కుమార్ లోధ్ మద్దతు తెలిపారు.అనేక ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు మద్దతు ఇస్తున్నాయని వై అశోక్ కుమార్ నిజాయితీగా ఉపాధ్యాయ అధ్యాపకుల సమస్యల కోసం గతంలో అనునిత్యం పోరాడిన వ్యక్తిగా ఉన్నారు. కాబట్టి వై అశోక్ కుమార్ కి అత్యధిక మెజార్టీతో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్జున్, జోసెఫ్, నరసింహ చారి, విజయ్ కుమార్, డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

## గుల్లకోటలో ఘోర రోడ్డు ప్రమాదం

**- ఘటనా స్థలంలో చిద్రమైన తలతో భీకరమైన వాతావరణం**

**- ప్రమాద సూచికలు లేక తరచూ ప్రమాదాలు**

**సూర్య ఎండపల్లి**

మండలంలోని గుల్లకోట ఐజేపి సెంటర్ వద్ద టిప్పర్ ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తల చిద్రమై మొండంతో నడిరోడ్డుపై భీకర వాతావరణం నెలకొంది. వివరాలకు వెళితే ఎండపల్లి గ్రామానికి చెందిన చీకటి వెంకటేష్ (40) అనే వ్యక్తి గుల్లకోట శివారు ఐకెపి సెంటర్ వద్ద నుండి ద్విచక్ర వాహనం పై వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో వెంకటేష్ తల టిప్పర్ టైర్ కింద పడడంతో తల చిద్రమై రహదారి పై చల్లా చెదురుగా పడడంతో భీకర వాతావరణం నెలకొంది ప్రమాద ఘటనను గమనించిన టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉండగా స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రాజరంపల్లి గుల్లకోట మధ్యలో ఐకెపి సెంటర్ వద్ద మూలమలుపులో సరైన సూచికలు లేకపోవడంతో గతంలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు చేసుకున్నాయనీ ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ప్రమాద సూచికలు వేగ నియంత్రకాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.